జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | గురువారం 10 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 215 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# ఆదాయ మార్గాలను వెతకండి!



## పన్నుఎగవేతలు ఉండకూడదు

## నూతన ఎక్సైజ్ పాలసీ సక్సెస్

## ఆదాయార్జన శాఖల సమీక్షలో అధికారులతో సీఎం చంద్రబాబు

**అమరావతి**

"మున్సిపల్ శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా బిల్డర్లు అసలు రిజిస్టర్ కాలేదని ఏఐ గుర్తించింది. అయితే, తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ప్రభుత్వం ఎటువంటి ఆమోదాలైనా తెలపాలి. పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు ఏఐని వినియోగించుకోవాలని చెప్పారు. అన్ని ఆదాయార్జన శాఖల్లోనూ ఇదే తరహా ప్రక్రియ అమలు చేసి పకడ్బందీగా పన్ను వసూళ్లు చేయాలి. టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా వ్యాపారులకు పన్ను చెల్లింపులు, అనుమతులు వంటివి సులభతరం అవుతున్నాయనే విషయాన్ని వారికి తెలియజేయాలని రాష్ట్రంలో సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా సొంతంగా ఆదాయం పెంచుకునేలా, పన్నుల వసూళ్లు పెరిగేలా ఆదాయార్జన శాఖలన్నీ పనిచేయాలని ముఖ్యమంత్రి

- మిగతా3లో




## రూ.1,332 కోట్లతో తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులు

### "తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులతో పర్యాటకంగా ఎంతో అభివృద్ధి జరిగేందుకు ఆస్కారం

### ఏడాదికి 4 మిలియన్ టన్నుల సరకు రవాణాకు అవకాశం ఉంటుంది"

**దిల్లీ:** తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రూ.1,332 కోట్లతో తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి వివరించారు. "తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులతో పర్యాటకంగా ఎంతో అభివృద్ధి జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. లక్షల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ ప్రాంతంలోనే ఉన్నాయి. తిరుపతి-వెల్లూరు మార్గం వైద్య, విద్య పరంగా ఎంతో కీలకం. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులతో 400 గ్రామాల్లోని 14 లక్షల మంది జనాభాకు లబ్ధి చేకూరుతుంది. 35 లక్షల పనిదినాలు కల్పించేందుకు అవకాశం ఉంటుంది. ఏడాదికి 4 మిలియన్ టన్నుల సరకు రవాణాకు అవకాశం ఉంటుంది" అని కేంద్ర మంత్రి వెల్లడించారు.

# సర్కార్ కుట్ర.. జగన్ ఇంటి వద్ద సెక్యూరిటీ తగ్గించారు



### 'అత్యధిక ప్రజాదరణ కలిగిన వ్యక్తి జగన్

### ప్రజల్లోకి వైఎస్ జగన్ వెళ్లిన సమయంలో భద్రతా లోపం స్పష్టంగా కనిపిస్తోంది ఒక మాజీ ముఖ్యమంత్రికి కల్పించాల్సిన కనీస భద్రత కూడా ఇవ్వడం లేదు.

**తాడేపల్లి**

కూటమి ప్రభుత్వం ఒక మాజీ ముఖ్యమంత్రికి కల్పించాల్సిన కనీస భద్రత వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి. జగన్ లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. వైఎస్ జగన్ ఇంటి వద్ద కూడా సెక్యూరిటీని తగ్గించారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'అత్యధిక ప్రజాదరణ కలిగిన వ్యక్తి జగన్. ప్రజల్లోకి వైఎస్ జగన్ వెళ్లిన సమయంలో భద్రతా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక మాజీ ముఖ్యమంత్రికి కల్పించాల్సిన కనీస భద్రత కూడా ఇవ్వడం లేదు. గతంలో రెండు సార్లు దాడి జరిగింది. పాదయాత్ర సమయంలోనూ అనేక అడ్డంకులు సృష్టించారు. గుంటూరు మిర్చి యార్డులో కార్యకర్తలే వలయంగా మారి భద్రత కల్పించారు. 200 మంది పోలీసులను పెట్టామని ఎస్పీ చెబుతున్నారు. కానీ, హెలికాప్టర్ వద్ద పది మంది పోలీసులు కూడా లేరు. వేల మంది హెలికాప్టర్ వద్దకు వచ్చినా పోలీసులు నిలువరించలేకపోయారు వైఎస్ జగన్‌ని లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోంది. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తిగా కూడా జగన్‌ను గుర్తించడం లేదు. జగన్‌కు భద్రత

- మిగతా3లో



## మోదీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తాడు

- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే
- 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం రాజ్యమేలుతోంది
- ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయి
- ఈ ప్రభుత్వానికి యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం లేదు



## దేశవ్యాప్తంగా దంచికొడుతున్నా ఎండలు

- భానుడి భగభగలకు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనాలు
- దేశంలోని పలు రాష్ట్రాలను వేడిగాలులు
- దేశరాజధాని ఢిల్లీ సహా గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఎడారి రాష్ట్రం రాజస్థాన్‌లోని బార్మర్‌లో దేశంలోనే అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు

## వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి

# డ్రామాలాడుతున్నారు



### పాపిరెడ్డిపల్లి పర్యటనకు 1100 మంది పోలీసులతో జగన్‌కు భద్రత

### ఆయన హయాంలో ఐపీసీ కన్నా వైసీపీ కోడ్ అమలు చేశారు

### వీఐపీ తీసుకువెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ 15 నిమిషాల్లో ఎలా ఎగిరింది

### ఈ హెలికాప్టర్ వివాదంపై హోం మంత్రి అనిత ఫైర్

**విశాఖపట్నం**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరుపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు 11 సీట్లతో తీర్పిచ్చినా సిగ్గు రాలేదా అంటూ ఫైర్ అయ్యారు. గతంలో ఐపీసీ కన్నా వైసీపీ కోడ్ అమలైందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి వెళ్తున్న జగన్మోహన్ రెడ్డికి అక్కడి పరిస్థితుల దృష్ట్యా 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామన్నారు. 250 మంది పోలీసులు హెలిపాడ్ వద్ద ఉన్నారని తెలిపారు. వీఐపీని తీసుకువెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ 15 నిమిషాల్లో ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇదంతా చేశారని అనిపిస్తోందని... వీటన్నింటి పైన విచారణ కొనసాగుతుందని తెలిపారు. మాట్లాడితే లా


- మిగతా3లో



## ఇది తీవ్రమైన ఉల్లంఘనే.. కేంద్రానికి 'సుప్రీం' చీవాట్లు

- ప్రమాదం జరిగిన వెంటనే సమీప ఆసుపత్రిలో ఉచిత వైద్య సాయం కల్పించడమే క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్ ఉద్దేశం.
- ఈ అలసత్వానికి సంబంధించి రోడ్డు రవాణా - జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సీనియర్ అధికారులకు కోర్టు సమన్లు జారీ చేసింది
- "అధికారులు కోర్టులకు హాజరైతేనే మా ఆదేశాలను తీవ్రంగా పరిగణిస్తారు
- ఈ విషయాన్ని మా సుదీర్ఘ అనుభవం ద్వారా మేం తెలుసుకున్నాం

# దేశవ్యాప్తంగా దంచికొడుతున్నా ఎండలు



**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి . పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే భారీగా నమోదవుతున్నాయి. భానుడి భగభగలకు జనాలు బయటకు వెళ్లాలంటేనే జంకుతు న్నారు. వృద్ధులు, పిల్లలు ఉక్కపోతకు అల్లాడిపోతున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలను మంగళవారం వేడిగాలులు వణికించాయి. దేశరాజధాని ఢిల్లీ సహా గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యా యి. ముఖ్యంగా ఎడారి రాష్ట్రం రాజస్థాన్ లోని బార్మర్ లో దేశంలోనే అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అక్కడ మంగళవారం 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైటనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది సాధారణం కంటే 7.6 డిగ్రీలు ఎక్కువ అని పేర్కొంది. బార్మర్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. జైసల్మేర్‌లో 45 డిగ్రీల సెల్సియస్, చిత్తోర్‌గఢ్‌లో 44.5 డిగ్రీల సెల్సియస్, బికనీర్‌లో 44.4 డిగ్రీల సెల్సియస్, గంగానగర్‌లో 44.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 7 నుంచి 9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ అని ఐఎండీ తెలిపింది.ఇక దేశరాజధాని ఢిల్లీలోని ప్రాథమిక వాతావరణ కేంద్రం సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. దీంతో రాజధానిలో ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం సఫ్దర్‌జంగ్‌లో ఉష్ణోగ్రతలు 40.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు ఐఎండీ పేర్కొంది. ఇది సాధారణం కంటే 5.1 డిగ్రీలు ఎక్కువ. గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని మొత్తం 27 స్టేషన్లలో 43 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. వాటిలో కనీసం 19 స్టేషన్లలో వేడిగాలులు నుండి తీవ్రమైన వేడిగాలులు నమోదైనట్లు పేర్కొంది.మరోవైపు గుజరాత్‌లోని సురేంద్ర నగర్‌లో 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజ్‌కోట్‌లో 44 డిగ్రీల సెల్సియస్, అమ్రేలిలో 43.8 డిగ్రీల సెల్సియస్, మహువ, కాండ్లాలో 43.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహువలో సాధారణం కంటే 8.3 డిగ్రీలు ఎక్కువ అని ఐఎండీ పేర్కొంది. మహారాష్ట్రలోని అకోలాలో 44.1 డిగ్రీల సెల్సియస్, నందూర్‌బార్‌లో 43.5 డిగ్రీల సెల్సియస్, జల్గావ్‌లో 43.3 డిగ్రీల సెల్సియస్, అమరావతరిలో 43 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని గుణ, రత్లామ్‌లలో ఉష్ణోగ్రతలు వరుసగా 43.4, 43.2 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఏప్రిల్ 10, 11 తేదీల్లో గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేడిగాలుల పరిస్థితుల నుంచి ఉపపశమనం లభించొచ్చని ఐఎండీ అంచనా వేసింది.

## ఇది తీవ్రమైన ఉల్లంఘనే..

# కేంద్రానికి 'సుప్రీం' చీవాట్లు



**న్యూఢిల్లీ:** రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స అందించే విషయంలో కేంద్ర ప్రభుత్వ అలసత్వాన్ని సుప్రీం కోర్టు మందలించింది. ఈ విషయాన్ని తీవ్ర ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ బుధవారం సంబంధిత అధికారులకు సమన్లు జారీ చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే సమీప ఆసుపత్రిలో ఉచిత వైద్య సాయం కల్పించడమే క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్ ఉద్దేశం. ప్రత్యేకించి గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపే)తో సహా రోడ్డు ప్రమాద బాధితులందరికీ దీన్ని వర్తింపజేయాల్సి ఉంటుంది. దీని అమలుకుగానూ కేంద్రానికి సుప్రీం కోర్టు మార్చి 14వ తేదీని గడువుగా ప్రకటించింది. అయితే గడువు దాటినా కేంద్రం ఇంతదాకా దీనిని అమలు చేయలేదు. "ప్రభుత్వానికి ఇచ్చిన గడువు ముగిసిపోయింది. దీనిని తీవ్రమైన కోర్టు ఆదేశాల ఉల్లంఘనగా పరిగణిస్తున్నాం" అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం బుధవారం వ్యాఖ్యానించింది. ఈ అలసత్వానికి సంబంధించి రోడ్డు రవాణా - జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సీనియర్ అధికారులకు కోర్టు సమన్లు జారీ చేసింది. "అధికారులు కోర్టులకు హాజరైతేనే మా ఆదేశాలను తీవ్రంగా పరిగణిస్తారు. ఈ విషయాన్ని మా సుదీర్ఘ అనుభవం ద్వారా మేం తెలుసుకున్నాం. ఏప్రిల్ 28వ తేదీన సమన్లు అందుకున్నవాళు కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలి. సకాలంలో చికిత్స అందకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక్కడ.. ఒక్క విషయాన్ని మేం స్పష్టంగా చెప్పదల్చుకున్నాం. ఎటువంటి పురోగతి సాధించలేదని మేం గనుక గుర్తిస్తే కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేస్తాం అని జస్టిస్ ఓకా సంబంధిత అధికారులను హెచ్చరించారు. రోడ్డుప్రమాదాల సమయంలో ఆ దారిన వెళ్లేవాళ్లు, పోలీసులు,కొన్నిసార్లు ఆస్పత్రులు కూడా ఎవరైనా ముందుకు వస్తారేమో అని ఎదురు చూస్తున్నాయి. ఇది ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోంది అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇదిలా ఉంటే.. 2023 డిసెంబర్‌లో నగదు రహిత చికిత్స అందించే విషయంలో కేంద్రం తొలి అడుగు వేసింది. ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఉచిత, నగదు రహిత వైద్య చికిత్స అందించడం ఎంవీఏ యాక్టు 2019లో భాగం. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు దీన్ని అమలు చేస్తున్నాయి. అయితే.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహకారంతో రోడ్డు రవాణా, హైవే మంత్రిత్వశాఖ దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలనుకుంది. రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాణాంతకంగా ఉన్న సమయంలో.. ప్రత్యేకించి గోల్డెన్ అవర్ టైంలో రోడ్డు ప్రమాద బాధితుడి ప్రాణాలు రక్షించే చికిత్స కోసం నగదు చెల్లింపులు చేయడానికి ఎవరూ లేనప్పుడు ఈ పథకం వర్తిస్తుంది. క్యాష్‌లెస్ ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్ స్కీమ్ కింద.. రోడ్డు ప్రమాదాలకు గురైన వాళ్ల చికిత్స కోసం ఏడు రోజులకుగానూ లక్షా 5 వేల రూపాయల ఖర్చు భరిస్తుంది. అయితే ఇది ప్రమాదం జరిగిన 24 గంటలలోపు పోలీసులకు తెలియజేస్తేనే!. ఇక..ఆస్పత్రులు మోటార్ వెహికిల్స్ యాక్ట్ ఫండ్ నుంచి ట్రీట్‌మెంట్ సొమ్మును రీయింబర్స్‌మెంట్ ద్వారా పొందుతాయి. ఇదికాక.. అదనంగా హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వాళ్ల కుటుంబాలకు ప్రభుత్వం రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా అందిస్తుంది. అయితే.. ఏడాదిన్నరగా ఈ పథకాన్ని ఆచరణలో పెట్టాలనే ప్రయత్నాలు మాత్రం ముందుకు సాగడం లేదు. ఈ ఏడాది జనవరి 8వ తేదీన సరైన విధివిధానాలతో ఓ పథకం రూపొందించాలంటూ కేంద్రానికి సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇదే కాకుండా.. మోటార్ వెహికిల్స్ యాక్ట్(సవరణ చట్టం)లోని సెక్షన్ 162(2) ప్రకారం.. ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా బాధితుల చికిత్సకు అయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది. కానీ, ఇది కూడా అమలు కావడం లేదని సర్వోన్నత న్యాయస్థానం గుర్తించింది.

## వక్ఫ్ సవరణ చట్టం అమలుపై సీఎం మమత సంచలన ప్రకటన



కోల్‌కతా : కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం అమలుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ చట్టం అమలు చేయబడదు అని మమత తేల్చిచెప్పారు. కోల్‌కతాలో జైన్ కమ్యూనిటీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మమత పాల్గొని ప్రసంగించారు. వక్ఫ్ సవరణ చట్టంతో మైనార్టీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సీఎం మమత పేర్కొన్నారు. మైనార్టీ ప్రజలు, వారి ఆస్తులను తాను పరిరక్షిస్తానని ఆమె స్పష్టం చేశారు. విభజించి పాలించాలనుకుంటే బెంగాల్‌లో కుదరదు. తనపై విశ్వాసం ఉంచండి. మీరంతా కలిసికట్టుగా ఉంటామని బలమైన సందేశం ఇవ్వండి. రాజకీయ ఉద్యమం ప్రారంభించాలంటూ రెచ్చగొట్టే వాళ్లను పట్టించుకోవద్దని మమతా బెనర్జీ సూచించారు. వక్ఫ్ బిల్లుపై ముర్షీదాబాద్ జిల్లాలో హింస చెలరేగడాన్ని ప్రస్తావించిన మమతా బెనర్జీ.. బంగ్లాదేశ్‌లో పరిస్థితిని చూడండి. ఈ సమయంలో బిల్లు ఆమోదించి ఉండకూడదు. బెంగాల్‌లో 33 శాతం మైనారిటీలు ఉన్నారు. వారి విషయంలో నేను ఏం చేయాలి?" అని ప్రశ్నించారు. బెంగాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఇండియా అన్నీ కలిసి ఉండేవని చరిత్ర చెబుతోందని, ఆ తర్వాత విభజన చోటుచేసుకుందని, ఇక్కడ నివసించాలని ఎవరైతే అనుకున్నారో వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ప్రజలంతా ఐక్యంగా, బలంగా నిలబడితే ఏదైనా సాధ్యమేనని మమత స్పష్టం చేశారు.

## దేశ సమస్యలు తీర్చాలంటే దేశాన్ని ఎక్సరే తీయాలి'..



**గాంధీ నగర్ :** దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దేశ సమస్యలు తీర్చాలంటే దేశాన్ని ఎక్సరే తీయాలని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో రెండో రోజు 'అఖిల భారత కాంగ్రెస్ కమిటీ' (ఏఐసీసీ) సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. దళితులు,ఆదివాసీలు,పేదల కోసం కాంగ్రెస్ పనిచేస్తోంది. బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ నిత్యం పోరాటం చేస్తుంది. కులగణనతో దేశంలో ఓబీసీల సంఖ్య తేలుతుంది. తెలంగాణలో కులగణన చేపట్టాం. జాతీయ స్థాయిలో జనగణన చేసే వరకు పోరాడుతాం. కుల గణనతో ఏ వర్గం జనాభా ఎంత ఉంటుందో తేలుతుందని వ్యాఖ్యానించారు.

## మోదీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తాడు



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తాడని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక ఆర్థికవ్యవస్థ లో ఇప్పుడు గుత్తాధిపత్యం రాజ్యమేలుతోందని, ప్రభుత్వ ఆస్తులన్నింటిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతున్నారని ఆయన ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరంలో జరిగిన ఏఐసీసీ సమావేశంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం రాజ్యమేలుతోంది. ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఈ ప్రభుత్వానికి యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం లేదు. కానీ ప్రభుత్వ ఆస్తులను మాత్రం ఒక్కొక్కటిగా మిత్రులకు కట్టబెడుతున్నారు. ఇలాగే కొనసాగితే ఏదో ఒకరోజు ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం ఈ దేశాన్ని అమ్మేస్తారు. నెహ్రూ నిర్మించిన ప్రభుత్వరంగ ఫ్యాక్టరీలు అన్నింటిని మోదీ అమ్ముతున్నారు' అని ఖర్గే విమర్శించారు.'దేశం కోసం నువ్వేం చేశావు, మేమేం చేశాం..? భవిష్యత్ తరాలకు నువ్వు ఏం ఇవ్వదల్చుకున్నావు..?' అని అడిగితే మోదీ నోరు మెదపరని, కానీ కాంగ్రెస్ పార్టీని నిందించడానికి మాత్రం ముందుంటారని ఖర్గే మండిపడ్డారు. దేశంలో అన్నింటా ప్రభుత్వ ఆధిపత్యమే కొనసాగుతున్నదని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్నదని, అందుకే ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

## త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**న్యూ ఢిల్లీ ఏప్రిల్ 9 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. భారత్ సహా పలు దేశాలపై టారిఫ్‌లు ప్రకటించారు. తాజాగా మరో బాంబు పేల్చారు అధ్యక్షుడు. త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత మోగించనున్నట్లు ప్రకటించారు. అమెరికాకు దిగుమతయ్యే ఔషధ ఉత్పత్తులపై భారీ ఎత్తున టారిఫ్‌లు విధించనున్నట్లు తెలిపారు.మంగళవారం రాత్రి నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. అమెరికాలో ఫార్మా ఉత్పత్తులు తయారు కావడం లేదన్నారు. అందుకే ఇతర దేశాల నుంచి వచ్చే ఔషధ ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. ఈ చర్యతో చైనా సహా వివిధ దేశాల్లోని ఫార్మా కంపెనీలన్నీ అమెరికాకు తరలివస్తాయని, ఇక్కడ తమ ప్లాంట్లను తెరుస్తాయని వ్యాఖ్యానించారు. కాగా, ఏప్రిల్ 2న భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, వీటిలో ఔషధ ఉత్పత్తులకు తాత్కాలికంగా మినహాయింపు లభించింది. ఇప్పుడు వాటిపై కూడా త్వరలోనే సుంకాలు విధించనున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు.ట్రంప్ నిర్ణయంతో భారత్‌కు పెద్ద ఎదురుదెబ్బే అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే.. భారత ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులకు అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. అమెరికా ప్రజలకు సరసమైన ధరలకే నాణ్యమైన ఔషధాలు అందడంలో భారతీయ ఫార్మా కంపెనీలది కీలకపాత్ర. భారత్ అమెరికాకు చేసే ఔషధ ఎగుమతులు ఎక్కువగా జనరిక్ మందులే ఉన్నాయని నిపుణులు పేర్కొన్నారు. అమెరికాకు భారత్ నుంచి 9 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి అవుతున్నాయి. భారత్ చేసుకుంటున్న దిగుమతులతో పోల్చితే ఇది 10 రెట్లు అధికం.అమెరికాలో లభించే జనరిక్ ఔషధాల్లో దాదాపు 70 శాతం దిగుమతి అయినవే. ఇందులో సుమారు 50 శాతం భారత్ నుంచి వచ్చినవే. సిప్లా, లుపిన్, సన్ ఫార్మా వంటి సంస్థలతో పోల్చితే జనరిక్ ఔషధాలను భారీగా ఉత్పత్తి చేస్తున్న జైడస్, అరబిందో, డాక్టర్ రెడ్డీస్ తదితర కంపెనీలపైనే అమెరికా టారిఫ్ పెంపు ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ఫార్మా కంపెనీలు.. అమెరికా మార్కెట్ నుంచి ఐరోపా, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల వైపునకు వెళ్లడమే ఉత్తమమని ఔషధ రంగ నిపుణులు భావిస్తున్నారు.

## రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఆర్బీఐ

**ముంబై :** ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఇవాళ ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. రెపో రేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. రెపో రేటు తగ్గించడం వల్ల .. బ్యాంకులపై రుణభారం తగ్గనున్నది.దీని వవల్ల బ్యాంకులు కూడా కస్టమర్లకు తక్కువ రేటుకే వడ్డీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా రుణాలపై ఈఎంఐలు తగ్గే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రెపో రేటను 6 శాతానికి తగ్గించాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు.

## విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం

**న్యూ ఢిల్లీ ఏప్రిల్ 9 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి రష్యా నుంచి మరోసారి ఆహ్వానం అందింది. మే 9న నిర్వహించే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం పంపింది. ఈ విషయాన్ని ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆండ్రీ రుడెంకో వెల్లడించారు.రెండో ప్రపంచయుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా ఏటా మే 9న రష్యా విక్టరీ డే పరేడ్ నిర్వహిస్తుంది. జర్మనీపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది. ఇక ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తన మిత్రదేశాలకు ఆహ్వానం పంపుతోంది. ఇందులో భాగంగానే ప్రధాని మోదీకి కూడా ఆహ్వానం పంపింది. విక్టరీ డే వేడుకలకు ప్రధాని మోదీ హాజరవుతారని తాము ఆశిస్తున్నట్లు ఆండ్రీ రుడెంకో తెలిపారు.కాగా, గతేడాది జూలైలో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటించారు. గత పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ను భారత్ సందర్శించాలని ఆహ్వానించారు. మోదీ ఆహ్వానాన్ని పుతిన్ కూడా అంగీకరించారు. అయితే, తేదీలు మాత్రం ఇంకా ఖరారు కాలేదు. 'పుతిన్ భారత పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి. మోదీ ఆహ్వానాన్ని ఆయన అంగీకరించారు. గతేడాది మోదీ మాస్కోలో పర్యటించారు.. ఇప్పుడు మా వంతు' అని రష్యా రాయబార కార్యాలయం గత నెల వెల్లడించిన విషయం తెలిసిందే. ఇక పుతిన్, మోదీలు తరచూ ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారు. వివిధ అంశాలపై సంభాషించుకుంటున్నారు. అంతేకాదు పలు అంతర్జాతీయ వేదికలపై కూడా ఇరువురు నేతలు సమావేశమవుతున్నారు.

# సర్కార్ కుట్ర.. జగన్ ఇంటి వద్ద సెక్యూరిటీ తగ్గించారు

-మొదటిపేజీ తరువాయి

కల్పించలేకపోతే చెప్పండి. ఇంటి వద్ద కూడా సెక్యూరిటీని తగ్గించేశారు. జగన్ ఇంటి వద్ద ఒక్క కానిస్టేబుల్ కూడా లేకుండా చేశారు. ఆయన భద్రతపై కేంద్ర హోంశాఖకు రిప్రజెంటేషన్ ఇస్తాం. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. మండలానికి ఒకరిని చంపితే కానీ భయం రాదు అనేలా భయోత్పాతం సృష్టిస్తున్నారు. చట్టానికి లోబడి పోలీసులకు సెల్యూట్ చేస్తాం. చట్టాన్ని మీరి అన్యాయాన్ని ప్రోత్సహించే వారికి కచ్చితంగా యూనిఫాం లేకుండా చేస్తాం.

తప్పుచేయకపోతే భుజాలు తడుముకోవడం దేనికి?. రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకోసం కొందరు పోలీసులు పనిచేస్తున్నారు. కొంతమంది పోలీసులకు పార్టీలు అంటగట్టి పోస్టింగ్ కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ముగ్గురు డీజీలకు పోస్టింగ్ ఇవ్వకుండా వేధిస్తున్నారు. నలుగురు ఐపీఎస్ అధికారులను వేధిస్తున్నారు. డీఎస్పీలను వీఆర్‌లో పెట్టారు. 120మంది సీఐలకు ఇంతవరకూ పోస్టింగ్స్ ఇవ్వలేదు. ఎవరో మెప్పు పొందడానికి పోలీసు సంఘాలు మాట్లాడటం కాదు. పోస్టింగ్స్ కూడా లేకుండా వేధింపులకు గురవుతున్న పోలీసుల కోసం మాట్లాడాలని కోరుతున్నాను. దేశంలోనే సీనియర్ లీడర్ అని చంద్రబాబు చెప్పుకుంటాడు. అన్ని రంగాల్లో ఆదాయం తగ్గితే జీఎస్డీపీ మాత్రం ఎలా పెరిగిందో అర్థం కావడం లేదు. 14 లక్షల కోట్లు అప్పులు చేసేశారని తప్పుడు ప్రచారం చేశారు. ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వారు దొంగతో సమానం. జగన్ సీఎంగా ఉన్నప్పుడు రాజకీయాల్లో వేలు పెట్టొద్దని పోలీసులకు స్పష్టంగా చెప్పారు. హోంమంత్రి అనిత మాట్లాడే ముందు ఆలోచించుకోవాలి. భద్రత కల్పిస్తే హెలీకాప్టర్ వద్దకు అంతమంది ఎలా వస్తారు?. జగన్ వస్తున్నాడంటే జనం తండోపతండాలుగా వస్తారు. మెసేజ్‌లు పెట్టి కార్యకర్తలు తరలి రావాలని పిలవాల్సిన అవసరం లేదు. హోంమంత్రి బాధ్యతా రాహిత్యంగా మాట్లాడటం సరికాదు. ఏం తప్పుచేశాడని వైఎస్ జగన్‌ను క్రిమినల్ అంటున్నారు. అక్రమ కేసులు బనాయించి 16 నెలలు జైల్లో పెట్టారు. మల్లెల బాబ్జీని ఎవరు చంపారో చెప్పాలి. దశరథ రామయ్యను ఎవరు హత్య చేశారో కూడా చెప్పాలి. చంద్రబాబును క్రిమినల్ అని మాట్లాడటం మాకు పెద్ద విషయం కాదు. మాకు విజ్ఞత ఉంది' అంటూ చురకలు అంటించారు.

# దుర్గ గుడి భూముల లీజు పొడిగింపు వివాదం

**విజయవాడ :** విజయవాడలో దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో ప్రధాన ప్రాంతంలో ఉన్న దాదాపు ఆరు ఎకరాల భూమి లీజు గడువు ముగియడంతో దానిని మరోమారు పొడిగించాలని లీజుదారుల నుంచి దేవాదాయ శాఖకు ప్రతిపాదనలు అందాయి. అందులో విద్యా సంస్థను నిర్వహిస్తుండటంతో మరో 50ఏళ్లకు పొడిగించాలని లీజుదారులు అభ్యర్థించారు. యాభై ఏళ్లుగా నామమాత్రపు ధరతో ఉన్న దుర్గగుడి భూముల లీజును మరోసారి పొడిగించే ప్రతిపాదనకు దేవాదాయ శాఖ అభ్యంతం తెలిపింది. యాభై ఏళ్ల తర్వాత ఏమి జరుగుతుందో తెలియనందున ఆలయ భూముల్ని సమగ్రంగా సర్వే చేసి వాటిని శాశ్వతంగగా డిజిటల్ రూపంలో భద్రపరిచిన తర్వాత లీజు ప్రక్రియపై ముందుకు వెళ్లాలని ఆ శాఖ కార్యదర్శి కమిషనర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి పటమట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో 5.90ఎకరాల భూమిని లీజుకు తీసుకున్న సిద్ధార్థ అకాడమీ పేరిట లీజు పొడిగించాలని కొందరు అధికారులు, దేవాదాయ శాఖ అధికారులకు మౌఖికంగా సూచించారు. దీంతో లీజు ప్రతిపాదనల్ని దేవాదాయ శాఖ ఎస్టేట్స్, లీగల్ విభాగం క్షుణ్ణంగా అధ్యయనం చేసి చట్ట ప్రకారం సాధ్యం కాదని తేల్చేశారు. యాభై ఏళ్లకు లీజును పొడిగిస్తే అప్పటికి 100ఏళు పూర్తై యాజమాన్య హక్కుల్ని దేవస్థానం కోల్పోతుందని, భూమికి శాశ్వత యజమానులుగా లీజుదారులు అవుతారని అభ్యంతరం అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో లీజు గడువును తగ్గించి పొడిగించాలనే సూచనలు అందాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజు కొనసాగుతుండటంతో లీజు పొడిగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కొత్తగా మరోసారి లీజుకు తీసుకోవాల్సిందేనని కొత్త చట్టం ప్రకారమే లీజులు పొందాలని వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో దుర్గగుడి భూముల లీజు వ్యవహారాన్ని కొలిక్కి తెచ్చే బాధ్యత ఇంఛార్జి హోదాలో ఉన్న ఉన్నతాధికారి భుజాలకు ఎత్తుకున్నారు. పెద్దసార్ ఆదేశించారంటూ అధికారులపై ఒత్తిడి చేయడంతో లిఖిత పూర్వకంగా వివరణలు, ప్రతిపాదనలు ఇస్తే తప్ప తాము ముందుకు వెళ్లలేమని ఆ శాఖ అధికారులు తేల్చేశారు. దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం అవుతుండటంతో దేవాదాయ శాఖ చట్టానికి కొన్నేళ్ల క్రితం మార్పులు చేశారు. పాత చట్టంలో లీజుల పొడిగింపుకు అవకాశం ఉన్నా కొత్త చట్టంలో లీజు పొడిగింపు క్లాజ్ లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజులో ఉన్న భూముల్ని మరోసారి పొడిగించడం ప్రస్తుత చట్టం ప్రకారం సాధ్యం కాదని, అలా చేయాలంటే క్యాబినెట్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు. దేవాదాయ శాఖ భూమి లీజు వ్యవహారంపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తులో తలెత్తే న్యాయవివాదాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని భయపడుతున్నారు. ఈ క్రమంలో భూముల లీజు పొడిగించాలని ఒత్తిడి చేస్తోన్న అధికారినే ఏ నిబంధన ప్రకారం భూముల లీజు పొడిగించాలో ప్రతిపాదనలు పంపాలని దేవాదాయ శాఖ అధికారులు సూచించారు. వ్యవసాయేతర భూమిగా వినియోగంలో ఉన్న భూమి విలువను ఎలా నిర్ణయిస్తారో కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు లక్షన్నర లీజుగా చెల్లిస్తుండగా 10శాతం పెంపుదలతో లక్షా 65వేలుగా లీజు ధరను ప్రతిపాదించడంపై కూడా దేవాదాయశాఖ అభ్యంతరం చెబుతోంది. చట్టంలో లీజు పొడిగింపు అవకాశం లేనపుడు బహిరంగంగా జరిగే ప్రక్రియలోనే భూమి ధరను ఖరారు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందులో విద్యా సంస్థలు కొనసాగుతుండటంతో బహిరంగ వేలాన్ని మినహాయించినా అద్దె ధరను మాత్రం మార్కెట్ ధరలకు అనుగుణంగా ఖరారు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. దేవాదాయ శాఖలో ఇన్‌ఛార్జి హోదాలో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి లీజు వ్యవహారంలో లిఖిత పూర్వకంగా ప్రతిపాదనలు చేయకుండా ముందుకు వెళ్లలేమని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మౌఖిక ఆదేశాలను పాటిస్తే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు తాము బాధ్యత వహించాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో గతంలో కానూరు గ్రామ పంచాయితీ పరిధిలో సర్వే నంబర్ 282లో ఉన్న 12.39 ఎకరాల భూమిని యాభై ఏళ్లకు లీజుకు ఇవ్వాలని సిద్ధార్థ అకాడమీ 1997 నవంబర్ 25న కోరగా అప్పట్లో దేవాదాయ శాఖ లేవనెత్తిన అభ్యంతరాలను గుర్తు చేస్తున్నారు. దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో మార్కెట్ ధరలకు అనుగుణంగా లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. 1975-76 భూమిని లీజుకు ఇచ్చినపుడు మొదటి ఆరేళ్లు రూ.6వేల రుపాయలకు లీజుకు ఇచ్చారని తర్వాతి పదేళ్లకు రూ.7వేలు, తర్వాత పదేళ్లు 8వేలు, ఆ తర్వాత పదేళ్లు 9వేలు, ఆ తర్వాత పదేళ్లు 10వేలు, ఆ తర్వాత ఏడాదికి రూ.11వేల అద్దె చెల్లించేలా యాభై ఏళ్లకు లీజుకు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సిద్ధార్థ అకాడమీ పేరిట విజయవాడ మొగల్రాజపురంలోని సర్వే నంబర్ 76లో 8.22 ఎకరాలు, పటమట సర్వే నంబర్ 17లో 5.98ఎకరాల భూమి సిద్ధార్థ అకాడమీ పేరిట లీజుకు ఉంది. 2012 నాటికి ఈ భూముల విలువ రూ.176.34కోట్లుగా నిర్ధారించారు. పటమటలో ఉన్న భూమికి గజం రూ.30వేల చొప్పున రూ.86.83కోట్లు, మొగల్రాజపురంలో ఉన్న భూమికి గజం రూ.22,500 చొప్పున రూ.89.51కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఈ విలువలు భారీగా పెరిగాయని దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం ఆ స్థాయిలో లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

# టీడీపీ నేతలదే హవా...

**విజయనగరం :** ఏపీలో కూటమి ఏకపక్ష విజయం దక్కించుకున్న జిల్లాల్లో విజయనగరం ఒకటి. దాదాపు అన్ని నియోజకవర్గాలను కైవసం చేసుకుంది కూటమి. బలమైన బొత్స సామ్రాజ్యం కూలిపోయింది. ఆ కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఓటమి చవిచూశారు. అయితే ఇంతటి విజయాన్ని నిలుపుకోలేని స్థితిలో ఉంది కూటమి. అధికారంలోకి వచ్చిన పది నెలలకే విభేదాల పర్వం మొదలైంది. పతాక స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లిమర్లలో పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే వర్సెస్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి అన్నట్టు పరిస్థితి మారింది. రెండు పార్టీల అధినాయకత్వాలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఈ ఇద్దరు నేతలు పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ కూటమిలో అడ్డగోలు చీలిక కనిపిస్తోంది.



2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ తరఫున లోకం మాధవి పోటీ చేశారు. టిడిపి శ్రేణులు సహకరించడంతో భారీ మెజారిటీతో గెలిచారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మాధవి టిడిపి శ్రేణులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శ ఉంది. టిడిపిని కాదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన వారికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. తనకంటూ నియోజకవర్గంలో ఒక సొంత క్యాడర్ను తయారు చేసుకునే పనిలో పడ్డట్టు తెలుస్తోంది. 2019లో కేవలం 5000 ఓట్ల వరకు మాత్రమే తెచ్చుకున్నారు మాధవి. అందుకే ముందు జాగ్రత్త చర్యగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను తన వైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ వచ్చారు నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు. తనకే టికెట్ వస్తుందని ఆయన ఆశలు పెట్టుకున్నారు. పార్టీ కోసం బాగానే ఖర్చు పెట్టారు. లోకేష్ పాదయాత్ర ముగింపును తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయించారు. అయితే ఇక్కడ టిడిపికి మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు ఉండేవారు. ఆయన వయోభారంతో పక్కకు తప్పుకోవడంతో బంగార్రాజుకు నియోజకవర్గ టిడిపి బాధ్యతలు అప్పగించారు. దీంతో తనకు టికెట్ ఖాయమని భావించిన కర్రోతు బాగానే కష్టపడ్డారు. పొత్తులో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించడంతో బాధపడ్డారు. కానీ చంద్రబాబు సముదాయించడంతో జనసేన అభ్యర్థి లోకం మాధవి గెలుపు కోసం కృషి చేశారు. అయితే ఇప్పుడు అదే కర్రోతును నిర్లక్ష్యం చేస్తున్నారు ఎమ్మెల్యే మాధవి. టిడిపి క్యాడర్ తో పాటు నాయకత్వాన్ని నిర్వీర్యం చేసే పనిలో పడ్డారు. అందుకే ఇక్కడ విభేదాలు రోజు రోజుకు ముదురుతున్నాయి. పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. ఎత్తుకు పైఎత్తులు అన్నట్టు సాగుతున్నాయి. కూటమి అధికారంలోకి రావడంతో కర్రోతు బంగార్రాజు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి దక్కింది. కీలకమైన మార్క్ ఫెడ్ అధ్యక్ష పదవి దక్కడంతో ఆయన సైతం నియోజకవర్గంలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో జనసేన ఎమ్మెల్యే మాధవి తో విభేదాలు మరింత ముదురుతున్నాయి. ఎమ్మెల్యే పాల్గొంటున్న కార్యక్రమానికి కుర్రోతు హాజరు కావడం లేదు. కర్రోతు బంగారు రాజు వెళున్న కార్యక్రమానికి లోకం మాధవి రావడం లేదు. దీంతో కూటమిలో ఒక రకమైన విచ్ఛిన్నకర పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఈ నియోజకవర్గంలో బొత్స కుటుంబం పట్టు బిగిస్తోంది. పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. అందుకే ఈ విషయాన్ని హై కమాండ్ దృష్టికి తీసుకు వెళ్లే పనిలో పడ్డాయి రెండు పార్టీల శ్రేణులు. అయితే మరోసారి అమరావతికి పిలిచి క్లాస్ పీకుతారా? లేకుంటే కీలక సూచనలు చేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.

## ఆదాయ మార్గాలను వెతకండి!

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మరిన్ని ఆదాయ మార్గాలను వెతకడంతో పాటు, ఎక్కడ ఆదాయం తక్కువగా నమోదవుతుందో దానికి గల కారణాలను వెతికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పన్నుల చెల్లింపుల దగ్గర నుంచి రశీదులు, నోటీసులు జారీ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగాలని చెప్పారు. బుధవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వంలా వ్యాపారులను వేధించడం కూటమి ప్రభుత్వ విధానం కాదని... వారితో సమన్వయం చేసుకుంటూ నిబంధనల ప్రకారం రావాల్సిన పన్నులన్నీ చెల్లించేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. పన్నుచెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డేటా సెంటర్, ఏపీసీటీడీ... ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు నోటీసుల జారీకి, గ్రీవెన్స్‌లు స్వీకరించడానికి ఏఐని వినియోగించి ప్రభుత్వ యంత్రాంగంలో మరింత వేగం పెంచవచ్చని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం రూ.1,37,412 కోట్లను 100 శాతం ఆర్జించేలా అన్ని శాఖలు కషి చేయాలని చెప్పారు. 2023%-%24 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2024%-%25కి గాను రాష్ట్రానికి సొంతంగా ఆదాయంలో 2.2శాతం వద్ధి నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో వద్ధి 4.1 శాతం పెరగ్గా, పన్నేతర ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. జీఎస్టీలో 4.9శాతం వద్ధి, ప్రొఫెషనల్ ట్యాక్స్‌లో 15.2శాతం వద్ధి, ఎక్సైజ్ ఆదాయంలో 24.3 శాతం వద్ధి నమోదైంది. కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకటించిన దగ్గర నుంచి ఆదాయాన్ని పరిశీలిస్తే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గతం కన్నా మెరుగుపడింది. అక్టోబర్ 2024 నుంచి మార్చి 2025 వరకు రూ. 4,330 కోట్ల ఆదాయం రాగా, దాదాపు 33 శాతం ఎక్సైజ్ ఆదాయం పెరిగింది. అలాగే, మున్సిపల్ శాఖలో 2023%-%24 కంటే 2024%-%25లో రూ.500 కోట్లకు పైగా ఆదాయం అదనంగా వచ్చింది. పన్నులకు సంబంధించి ఇంకా సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తులకు సంబంధించిన పన్నులు, అలాగే, ఖాళీ స్థలాల పన్నులు అధికంగా వసూలు కావాల్సి ఉన్నాయి. మార్చి నెలలో ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో కేవలం 6 రోజుల్లోనే మొత్తం ఆస్తిపన్నులు రూ.240 కోట్లు వసూలయ్యాయని అధికారులు చెప్పారు.

## వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి డ్రామాలాడుతున్నారు

-మొదటిపేజీ తరువాయి

అండ్ ఆర్డర్ లేదు లా అండ్ ఆర్డర్ లేదు అంటున్నారని.. గతంలో చంద్రబాబు బయటికి రాకుండా అడ్డుకున్నారని.. ఎయిర్‌పోర్టుల్లో గుండాలను పెట్టి, అడ్డుకున్నారని గుర్తుచేశారు. పార్టీ కార్యాలయాల మీద దాడులు చేయించారని.. ఇలాంటివన్నీ చేసింది జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కస్టోడియల్ టార్చర్ అనేది జగన్మోహన్ రెడ్డి సంస్రంస్కృతిఅని.. తమది కాదని స్పష్టం చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించినందుకు తమ మీద అనేక మంది మీద కేసులుపెట్టారన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని.. కానీ ఒక మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నామని చెప్పారు. ఇవ్వాల్సిన భద్రత కన్నా ఎక్కువ భద్రత ఇస్తున్నామని వెల్లడించారు. పోలీసుల బట్టలు ఊడదీస్తామంటూ మాట్లాడే పద్ధతి సరియైనదేనా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో 2526 హత్యలు జరిగాయని.. అక్కడికి వెళ్తామన్నా కూడా.. తాము ప్రొటెక్షన్ ఇస్తామని తెలిపారు. ఎవరైనా పోలీస్ డిపార్ట్‌మెంట్ మీద శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడినా, పోస్టులు పెట్టినా తగిన విధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై హోం మంత్రిగా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ స్వయంగా మీటింగ్ పెట్టి.. పార్టీ నిర్ణయాన్ని, ప్రభుత్వం నిర్ణయాన్ని గౌరవించాలని.. ఎవరు బయటకు రావద్దని పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా హోంమంత్రి అనిత గుర్తు చేశారు.

## రజనీని అడ్డంగా బుక్ చేస్తున్న ఎంపీ

**గుంటూరు :** వైసిపి నేతల విషయంలో టిడిపి నేతలు కొంతమంది కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు కొంతమంది టీడీపీ నేతలు గతంలో తమ ఇబ్బంది పెట్టిన నాయకుల విషయంలో వెనక్కు తగ్గడం లేదు. ఈ విషయంలో పల్నాడు జిల్లా ముందుంటుంది. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు వర్సెస్ చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి విడుదల రజిని ల మధ్య వాతావరణం చినికి చినికి గాలి వానగా మారింది. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎంపీ కంటే మంత్రిగా ఉన్న రజిని పవర్ ఫుల్ గా ఉండేవారు. ఆమె మాటకు వైసీపీ అధిష్టానం వద్ద కాస్త వెయిట్ ఎక్కువగా ఉండేది. దీనితో రజిని ఆడిందే ఆట పాడిందే పాటగా ఉండేది. దీనికి తోడు అధికారులు కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆమెకు పెద్ద ఎత్తున సహకరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇలా సహకరించబట్టే ఐపీఎస్ అధికారులను అడ్డం పెట్టుకుని.. ఒక స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి ఏకంగా రెండు కోట్ల రూపాయలు రజనీ తీసుకున్నారు అనేది టీడీపీ ప్రధాన ఆరోపణ. ఇక రజనీ విషయంలో లావు కృష్ణదేవరాయలు ఇప్పుడు దూకుడుగా ఉన్నారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. లావు కృష్ణదేవరాయలపై ఆరోపణలు చేసిన రజిని ఆ తర్వాత ఎంపీ ఇచ్చిన స్ట్రోక్ కి కంగుతిన్నారు. ఆమె మొదలు పెట్టారని తాను ఆపే ప్రసక్తే లేదని.. ఇది ఎక్కడ వరకు వెళుతుందో చూడాలంటూ లావు కృష్ణదేవరాయలు ఘాటుగా మాట్లాడారు. చాలెంజ్ కు తగ్గట్టు ఇప్పుడు రజిని వ్యవహారాలపై ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆమె చేసిన అక్రమాలకు.. సంబంధించి నివేదికలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో పాటుగా కేంద్ర ప్రభుత్వం పెద్దలకు కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రైతుల భూముల విషయంలో ఆమె అనుసరించిన వైఖరి, పాల్పడిన అక్రమాలపై సాక్షా లతో సహా ఆయన ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఆమె మరిది గోపిని అడ్డం పెట్టుకొని ఆమె పెద్ద ఎత్తున చిలకలూరిపేట నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడ్డారు అనేది ఎంపీ ఆరోపణ. ఇప్పుడు వాటిని రుజువు చేసేందుకు పక్కా.. ఆధారాలతో ఆయన రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. తాజాగా చిలకలూరిపేటలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ లో కొంతమంది రైతులు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు కూడా చేసారు. రజినీ పై చర్యలు తీసుకోవాలని ఆమె మరిది గోపి పై కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాగే మరికొన్ని కేసులు బయటకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించిన వ్యవహారంలో ఏసీబీ అధికారులు గవర్నర్ అనుమతి తీసుకునే కేసు నమోదు చేశారు. దీనితో భవిష్యత్తులో రజనీకి ఇబ్బందులు తప్పవని.. ముఖ్యంగా లావు కృష్ణదేవరాయల నుంచి ఆమె మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని, ఇదే ఆమె రాజకీయ జీవితాన్ని నాశనం చేసినా ఆశ్చర్యం లేదంటూ కొంతమంది కామెంట్ చేస్తున్నారు.

# బిగ్ బాస్ లోకి అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్

**రాజమండ్రి :** ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది ఎవరైనా ఉన్నారంటే వారు 'అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్. గత 4 రోజులుగా నెట్టింట వీరిపై ఒకటే ట్రోల్స్, మీమ్స్, క్లారిఫికేషన్ వీడియోస్, అపాలజీ వీడియోస్. చాలాకాలంగా పచ్చళ్ల వ్యాపారం చేస్తూ కస్టమర్లపై బూతులతో విరుచుకుపడడంతో వీరిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ప్రముఖ రియాల్టీ షో బిగ్ బాస్‌లో అలేఖ్య చిట్టి, రమ్య సిస్టర్స్‌లో ఒకరికి ఛాన్స్ వస్తుందనే వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. బిగ్ బాస్ సీజన్ 9 త్వరలోనే కొన్ని నెలల్లో ప్రారంభం కానుండగా.. ప్రతి ఏడాది ఆగస్ట్ లేదా సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో ప్రోగ్రాం స్టార్ట్ అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో కంటెస్టెంట్స్ ఎంపిక, బిగ్ బాస్ ప్రోగ్రాం నిర్వహణ పనుల్లో టీం ఉంది. సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిన వారికి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు బిగ్ బాస్ ఎంట్రీ దక్కుతుంది. 'అలేఖ్య చిట్టి పికిల్స్' సిస్టర్స్‌పై మీమ్స్, ట్రోల్స్, వీడియోలు 100 మిలియన్స్‌కు పైగా వీడియోలతో ట్రెండ్ అవుతున్నాయి. దీంతో వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయని నెట్టింట చర్చ సాగుతోంది. అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్‌లో రీల్స్‌తో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న రమ్యకే ఆ అవకాశం ఉంటుందని నెటిజన్లు అంటున్నారు. మోడ్రన్ డ్రెస్సుల్లో ఆమె చేసిన రీల్స్ ఎక్కువగా ట్రెండ్ అవుతుండడమే దీనికి కారణమని చెబుతున్నారు. తాజాగా, జియో హాట్ స్టార్‌లో పికిల్స్‌కు సంబంధించి ఓ సీన్ సైతం వీడియో షేర్ చేశారు. ప్రభాస్ ఛత్రపతి సినిమాలో ఓ సీన్‌తో వీడియో విడుదల చేశారు. తాజాగా, బిగ్ బాస్ ఆదిరెడ్డి కూడా తన యూట్యూబ్ ఛానల్‌లో ఈ విషయంపై స్పందించారు. వారిలో ఒకరు బిగ్ బాస్‌కు రావొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజమండ్రి వేదికగా 'అలేఖ్య చిట్టి పికిల్స్' పేరుతో ముగ్గురు సిస్టర్స్ సుమ కంచర్ల, అలేఖ్య చిట్టి, రమ్య మోక్ష కంచర్ల (రమ్య గోపాలకృష్ణ) సోషల్ మీడియాలో పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించారు. వీరిలో రమ్య తన రీల్స్‌తోనూ పాపులర్ అయ్యారు. తమను విమర్శించిన వారిపై అంతేస్థాయిలో సోషల్ మీడియా వేదికగా విమర్శలు సైతం చేశారు. అయితే పచ్చళ్ల ధరలు ఎక్కువగా ఉన్నాయంటూ ప్రశ్నించిన ఓ నెటిజన్‌కు వీరిలో ఓ అమ్మాయి అలేఖ్య అతనిపై బూతులతో విరుచుకుపడింది. ఈ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇదే సమయంలో తమను కూడా అలానే తిట్టిందంటూ మరిన్ని ఆడియో లీక్స్ బయటకు వచ్చాయి. దీంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లపై ట్రోలింగ్ మొదలైంది. అంత దారుణంగా ఎలా తిడతారంటూ కామెంట్స్ చేశారు. దీంతో అక్క సుమ కంచర్ల తాను తిట్టలేదని.. తనను ట్రోల్ చెయ్యొద్దని వేడుకున్నారు. ఈ

## సంపాదకీయం

# ఆక్వాను వదలని ట్రంప్ టారీఫ్‌లు

'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం, అమెరికా ఫస్ట్' నినాదాలతో అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన దూకుడు స్వభావంతో వాణిజ్య యుద్ధానికి తెర లేపాడు. ఏప్రిల్ రెండవ తేదీన వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో వ్యాపార సంబంధ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించాడు. పెంచిన సుంకాలు ఏప్రిల్6 నుండే అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల 60 పైగా దేశాలు ప్రభావితం అవుతున్నాయి. భారత్‌పై 27 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 32 శాతం, ఇతర దేశాలపై 10 శాతం సుంకాలు విధించారు. భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు ఎగుమతుల విలువ 77.5 బిలియన్ డాలర్లు. భారత్ నుండి ఎగుమతి అయ్యే ప్రధాన వస్తువులు ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఫార్మా ఉత్పత్తులు, యంత్రాలు, పెట్రోలియం ఉత్పత్తులు. అయితే ఈ సుంకాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా పడనుంది. ముఖ్యంగా మన రాష్ట్రానికి సంబంధించిన సీ ఫుడ్స్, ఆక్వా రంగాలను తీవ్రంగా నష్టపరచనున్నాయి. రొయ్యల ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. 2022-23 సంవత్సరంలో భారత్ నుండి 63.969 కోట్ల విలువ కలిగిన 1.73 మిలియన్ టన్నుల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అమెరికా మత్స్య ఉత్పత్తులకు పెద్ద మార్కెట్. మొత్తం 5.6 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు ఎగుమతి అయితే అందులో 2.4 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. దాదాపు 40 శాతం మార్కెట్ వాటా భారత్‌దే. మన దేశం నుండి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంస ఉత్పత్తిల్లో రొయ్యలు మూడవ స్థానంలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు ఆక్వా కల్చర్ అభివృద్ధి ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండి అత్యధికంగా ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ జిల్లాలో దాదాపు 1.20 లక్షల ఎకరాలు, రాష్ట్ర వ్యాప్తంగా 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంది. పశ్చిమ గోదావరి నుండే 3.5 లక్షల టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మొత్తం 18 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇందులో విదేశీ ఎగుమతుల వాటానే అధికం. కోవిడ్-19 కారణంగా ఎగుమతులు నిలిచిపోయి పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయింది. దీనికి తోడు వైరస్‌ల బెడద, ధరలు పతనం కావడం, రైతులకు సాగు పెట్టుబడి పెరిగి పోవడంతో ఆక్వా పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఇటువంటి సమయంలో ట్రంప్ 27 శాతం సుంకాలు విధించడంతో పరిస్థితులు మరింత దిగజారిపోతున్నాయి. అమెరికా సుంకాలు విధించగానే 100 కౌంట్ రొయ్య ధర 240 నుండి 200 రూపాయలకు పడిపోయింది. కంపెనీలు కొనడానికి ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అమెరికా ఏప్రిల్-6వ తేదీ నుండే సుంకాల పెంపు అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న వాటి పరిస్థితి ఏంటి? ఆరవ తేదీ తరువాత అమెరికా రీచ్ అయ్యే ప్రతి సరుకుపై పెరిగిన సుంకాలు అమలు చేస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ టారిఫ్ అమలైతే లక్ష రూపాయలు విలువ చేసే రొయ్యలు అమెరికాకు ఎగుమతి చేస్తే 26 వేల రూపాయల పన్ను కట్టాలి. అంతేకాకుండా రవాణా, ప్యాకింగ్, ఇతర ఖర్చులు కలిపి దాదాపు 50 శాతం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ ఎగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీలు (ఎ.డి.డి)-3.88 శాతం, కౌంటర్ వైలింగ్ డ్యూటీలు (సి.వి.డి)-5.77 శాతం సుంకాలను వసూలు చేస్తున్నారు. కొత్తగా ప్రకటించిన టారిఫ్‌తో కలుపుకుంటే 35 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 1 లక్ష టన్నుల రొయ్యలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్నాయి. అమెరికాకు 20-40 కౌంట్ ఉన్న రొయ్యలనే ఎగుమతి చేస్తారు. ఎగుమతిదారులు 30 కౌంట్ రొయ్యలను 480 రూపాయలకు కొని కోల్ట్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచారు. కొత్త టారిఫ్ ప్రకారం ఎగుమతి చేస్తే మరో 80 రూపాయలు అదనంగా ఖర్చు అవుతుంది. అంటే టన్నుకు రూ.8.50 లక్షలు నష్టం వస్తోంది. ఉన్న సరుకును ఎగుమతి చేయలేరు. కోల్డ్ స్టోరేజ్ ఖర్చులు భరించలేరు. మరోవైపు వడ్డీల భారం ఉండనే ఉంది. ఈ సుంకాల విధింపు వల్ల ఎగుమతిదారులే కాకుండా.. రొయ్యల రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం జరగనుంది. ఒడిదుడుకుల ప్రభావం మొట్టమొదట పడేది రైతులు, కార్మికుల పైనే. కౌలుకు తీసుకుని సాగు చేసే రైతుల పరిస్థితి మరింత దారుణం. సాగుతో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఫీడ్ కంపెనీలు, టెస్టింగ్ ల్యాబులు, మెడిసిన్ కంపెనీలు, ప్యాకింగ్ యూనిట్లు, ఇందులో పని చేసే కార్మికులపై వీటి ప్రభావం తీవ్రంగా పడుతుంది. రాష్ట్రంలో 450 పైగా రొయ్యల హేచరీలు, 50 పైగా ఫీడ్ మిల్లులు, 2 లక్షల పైగా రొయ్యల చెరువులు, 250 ప్రాసెసింగ్ ప్లాంట్లు, 6 వేలకు పైగా పడవలు, నౌకల ద్వారా కూడా వేలాది మందికి ఉపాధి కల్పుతుంది. 1.5 లక్షల మంది రైతులున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఆక్వా పరిశ్రమ ఉపాధి చూపుతుంది. పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతే వీరంతా ఉపాధిని కోల్పోతారు. ట్రంప్ భారత పర్యటన సందర్భంలోనే భారత్‌పై సుంకాలు విధిస్తానని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. అమెరికాతో సత్సంబంధాలు ఉన్నా సంప్రదింపులు జరపలేదు. ట్రంప్ నా స్నేహితుడు, హౌడీ-మోడీ అని ప్రచారం చేసిన ప్రధాని ఇప్పుడు స్పందించటంలేదు. అక్రమ వలసదారుల పేరు చెప్పి భారతీయుల కాళ్లకు గొలుసులు కట్టి బానిసల్లా ఇండియాకు పంపినా నోరు మెదపలేదు. సుంకాలు విధించి ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నా కిమ్మనడం లేదు మన ప్రధాని. దీంతో రూ.18 వేల కోట్ల టర్నోవర్ కలిగిన ఆక్వా పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతుంది. లక్షల మంది రైతులు, కార్మికులు, ఎగుమతిదారులు నష్టపోతున్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సిక్స్, ఫోర్ అంటూ పథకాల ప్రచారంలో మునిగిపోయింది. ఈక్విడార్ నుండి ఎగుమతిలో గట్టి పోటీ ఎదురవుతుంది. ఇదే అలసత్వం ప్రభుత్వాలు ప్రదర్శిస్తే, ఇండియన్ మార్కెట్ అంతా ఈక్విడార్, ఇండోనేషియా వంటి దేశాలకు షిఫ్ట్ అయిపోతుంది. ఆక్వా రంగం నిలదొక్కుకోవాలంటే ఎగుమతులను ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేసే విధంగా, అమెరికాపై ఆధార పడకుండా ప్రత్యామ్నాయ మార్కెట్లను ఏర్పాటు చేసుకోవడానికి దీర్ఘకాల వ్యూహాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. తక్షణ ఉపశమనంగా రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి. ఎగుమతిదారులకు, కార్మికులకు ఆర్థికంగా అండగా నిలవాలి. ఎ.పి ఆర్థిక వ్యవస్థలో ఆక్వా రంగం కీలకమైంది. కనుక దీన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

# సత్యాహింసల మార్గదర్శి మహావీరుడు



వేదయుగంలో పెరిగిన జీవహింస, ఖర్చుతో కూడిన యజ్ఞయాగాలు, క్రతువులు, సమాజంలో పేరుకుపోయిన వర్ణ వివక్ష, మత వైషమ్యాలు, ఆర్థిక అసమానతలు ఆలోచనా పరులైన కొద్దిమందిలో జిజ్ఞాసను రేకెత్తించాయి. వీటిని అధిగమించడానికి అజీవకులు, చార్వాకులు, జైన, బౌద్ధ మతకర్తలైన.. మహావీరుడు, బుద్ధుడు వంటివారు క్రీ.పూ 6వ శతాబ్దంలో భావవికాసానికి నాందిపలికారు. జైనమతాన్ని అనుసరించేవారు జైనులు. జినులు అంటే కోరికలను జయించి వారు అని అర్థం. జైన మతాన్ని వృషభ నాథుడు స్థాపించగా, ఇది 'జిన' (విజేత) అనే పదం నుంచి వచ్చింది. జైన మత గురువులను తీర్థంకరులని పిలుస్తారు. తీర్థంకరులంటే పూర్ణ పురుషులు. జీవన ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించినవారు.జైనమతంలో తొలి తీర్థంకరుడు వృషభనాథుడు కాగా, ఆయన గురించి ఋగ్వేదంలో పేర్కొనబడింది. అంతే కాదు విష్ణు పురాణం, భాగవత పురాణంలో నారాయణావతారంగా కీర్తించ బడ్డాడు. దీనిని బట్టి జైన మతం ఋగ్వేద మతం అంతటి ప్రాచీనమైంది. ఇక, చిట్ట చివరి ఇరవై నాలుగో తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడని జైనుల విశ్వాసం.బీహార్‌లో వైశాలికి సమీపములో కుండ గ్రామంలో క్రీ.పూ. 599 లో (అధిక సంఖ్యాకుల విశ్వాసం) క్షత్రియ కుటుంబములో సిద్దార్థ మహారాజుకు, రాణి త్రిషలకు జన్మించిన మహావీరుడికి తల్లి దండ్రులు పెట్టిన పేరు వర్ధ మానుడు. కొందరు జైనులు మాత్రం మహావీరుడు క్రీస్తు పూర్వం 599లో జన్మించాడని నమ్ముతుండగా, మరి కొందరు క్రీస్తు పూర్వం 615లో జన్మించాడని భావిస్తున్నారు. అయితే ఇందులో దేనికీ స్పష్టమైన ఆధారాలు లేవు. హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్ర మాసం 13వ రోజున అంటే చైత్ర శుక్ల త్రయోదశి రోజున మహావీరుడు జన్మించారు. అల్లారుముద్దుగా పెరిగిన మహావీరుడు తల్లి దండ్రులు 28 వ ఏట మరణించారు. యశోధరను వివాహమాడి, ఓ కుమార్తెకు జన్మనిచ్చిన తరువాత తన రాజ్యాన్ని 30 సంవత్సరాల పాటు పరిపాలించిన మహావీరుడు అకస్మాత్తుగా తన సింహాసనాన్ని, కుటుంబాన్ని విడిచి పెట్టి సత్యాన్వేషణ కోసం స్వయం గా బయలు దేరాడు. తన 30వ ఏట గృహస్థ్యాన్ని త్యజించి, ఆరు సంవత్సరాలు మక్కలి గోశాలుని శిష్యునిగా ఉన్నాడు. 36 వ ఏట సన్యాసాన్ని స్వీకరించి, వర్ధమాను డు ఆ తరువాత రిజుపాలిక నదీ తీరంలోని జృంబిక గ్రామం దగ్గర కఠోర తపస్సు చేశాడు. తన 43వ ఏట సాలవృక్షం కింద వైశాఖమాసం పదమూడో రోజున జృంభిక గ్రామంలో జానోదయం కలిగింది. తద్వారా తపోసిద్దిని పొందాడు. తదనంతరం... వర్ధమానుడు అంగ, మిథిల, కోసల, మగధదేశాలలో తన తత్వాన్ని ప్రచారం చేశాడు. అప్పటి కే జైన మతానికి 23 మంది తీర్థంకరులుగా ఉన్నప్పటికీ మహావీరుడు బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఆ మతానికి సంబంధించిన వివరాలు వెలుగు చూశాయి. 32ఏళ్ళ పాటు అహింసా ధర్మముతో ప్రచారం జరిపిన మహావీరుడు తన 72వ ఏట క్రీ.పూ.527లో పావాపురిలో దేహాన్ని త్యజించాడు.మహావీరుని బోధనలు: 1. వైదిక కర్మలు చేయడం, దేవుణ్ని వేడు కోవడం వల్ల మనిషికి ఉపయోగం లేదు. 2. చెడు చేయకుండా మంచి జీవితాన్ని గడపడమే మోక్ష మార్గం. 3. జైనమత ప్రకారం 'ఆత్మ' ప్రాణులకే కాదు, ప్రతి వస్తువులోను ఉంటుంది. దేవుడితో నిమిత్తం లేదు. 4. సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ చరిత్ర- మోక్ష మార్గాలు. వీటిని 'త్రిరత్నాలు' అంటారు. (సరైన విశ్వాసం, సరైన జ్ఞానం, సరైన నడవడి) 5. పార్శ్వ నాథుడు ప్రతిపాదించిన సత్య, అహింస, అపరిగ్రహ, అనస్తేయ అనే నాలుగు మూల సూత్రాలకు మహావీరుడు బ్రహ్మచర్య సూత్రాన్ని అదనంగా జోడించాడు. వీటిని 'పంచానువ్రత' అని పిలుస్తారు. పార్శ్వనాథుడు శ్వేతాంబర వాదాన్ని, మహావీరుడు దిగంబర వాదాన్ని సమర్థించారు.మహావీరుని అనుచరులను నిగ్రంధులు అంటారు (బంధాల నుంచి విముక్తి పొందిన వారు). జైనులు పూజించే స్త్రీ దేవతను 'విద్యాదేవి' అని పిలుస్తారు. జైన మతంలో సల్లేఖనం (శరీరాన్ని క్షీణించుకొని మరణించడం) ద్వారా పరమపదం చేరుకోవడం ఆచారం. చంద్రగుప్త మౌర్యుడు సల్లేఖనం ద్వారా పరమపదించాడు. భారతీయ వాస్తు - శిల్ప కళాభివృద్ధికి జైనమతం గొప్ప సేవ చేసింది. మహావీరుడు సాధారణంగా కూర్చొని లేదా నిలబడి ధ్యాన భంగిమలో, అతని క్రింద ఉన్న సింహం చిహ్నంగా చిత్రీకరించ బడింది. ఉత్తర భారతదేశం లోని మధురలోని పురావస్తు ప్రాంతాల నుండి అతని మొట్టమొదటి విగ్రహాన్ని క్రీ.పూ 1వ శతాబ్దం నుండి క్రీ. శ. 2వ శతాబ్దంకి చెందినది. అయన పుట్టిన రోజును మహావీర్ జయంతిగా జరుపు కుంటారు. ఆయన మోక్షంను జైనులు దీపావళిగా గుర్తించారు. చిన్న వయసులోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు సత్యం, అహింస, ప్రేమ మార్గాన్ని చూపించిన మహావీరుని జయంతి సందర్భంగా జైన మతానికి చెందిన వారు వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటారు. మహావీరుని ఊరేగింపు కూడా నిర్వహిస్తారు. దీని ద్వారా మహావీరుని సందేశాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తారు.

# గాంధేయవాది మొరార్జీ దేశాయ్



తాను నమ్మిన సిద్ధాంతాలతో ఏనాడూ రాజీపడని విలక్షణ వ్యక్తిత్వం దివంగత ప్రధాని మొరార్జీ దేశాయ్‌కే సొంతం. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు. ధృఢమైన గాంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల - వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయవాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. 1927-28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ క్రియాశీలక రాజకీయాల వైపు తిరిగి చూడలేదు. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భడేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్‌లో సివిల్ సర్వీసులో చేరారు. మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, ఆయన బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హోంమంత్రి బాధ్యతలను చేపట్టారు.1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964, 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతో పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు. 1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు.అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే -ఎ - పాకిస్తాన్ - 1986లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ.మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు. దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు. పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశచరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్పనాయకునికి అలాంటి అవకాశం లేకుండాపోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం.మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించినందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్నుమూశారు.

## ఐపిటి విద్యార్థి స్టార్టప్ నెక్సస్ కోహెూర్ట్ 20 ప్రోగ్రామ్‌లో

# విజయవంతమైన పట్టభద్రత

**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి), తిరుపతి జిల్లా ప్రతినిధి**

శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మస్యూటికల్ టెక్నాలజీ (ఐ పి టి) విద్యార్థి, స్టార్టప్ నెక్సస్ కోహెూర్ట్ ఛ20 ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మస్యూటికల్ టెక్నాలజీ లో బి.ఫార్మసీ 6వ సెమిస్టర్ విద్యార్థి అయిన వైష్ణవి హరిష్, 3వ ఫిబ్రవరి 2025 నుండి 2వ ఏప్రిల్ 2025 వరకు న్యూఢిల్లీలోని అమెరికన్ సెంటర్‌లో నిర్వహించిన ప్రఖ్యాత స్టార్టప్ నెక్సస్ కోహెూర్ట్ ఛ20 ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ప్రోగ్రామ్, యుఎస్ ఎంబసీకి సహకారంగా ఉకాన్ గ్లోబల్‌తో భాగస్వామ్యంగా నిర్వహించబడిన ఒక ప్రీ-ఇంక్యూబేషన్ ఇనిషియేటివ్, విద్యార్థులు మరియు ఆశావహ యువతలకు సృజనాత్మకతను, ఉత్పత్తితత్వాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఉంటుంది. వైష్ణవి తన భాగస్వామ్యంతో 'స్మార్ట్ డిజిటల్ స్టెతోస్కోప్' అనే సృజనాత్మక ఆలోచనను ప్రజెంటేషన్ చేశారు మరియు పూర్తి చేయడంపై సర్టిఫికేట్ అందుకున్నారు. శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్. వి. ఉమ ఈ విజయం కోసం వైష్ణవిని అభినందించారు. ఈ సాధన విద్యార్థి అంకితభావం, సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించడమే కాకుండా, ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మస్యూటికల్ టెక్నాలజీ లో సాగుతున్న పారిశ్రామిక రంగ సంస్కృతిని కూడా ప్రతిబింబిస్తుంది అని అన్నారు. ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మస్యూటికల్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్. స్. జోష్నా రాణి, నెక్సస్ ప్రీ-ఇంక్యూబేషన్ ప్రోగ్రామ్




విజయవంతమైన పూర్తి వైష్ణవికి ఒక ముఖ్యమైన సాధన అని వివరించారు. ఈ తరహా ప్రఖ్యాత ప్రోగ్రామ్లలో విద్యార్థులను పాల్గొనమని ఆమె బలంగా ప్రోత్సహించారు. విద్యార్థి మెంటార్ ప్రొఫెసర్. ఏ. శ్రీదేవి , 'స్మార్ట్ డిజిటల్ స్టెతోస్కోప్' ఆధునిక ఫీచర్లు మరియు అందుబాటుతో ఆరోగ్య సంరక్షణ గుణాత్మకతను తిరగరాసే లక్ష్యంతో రూపొందించబడింది అన్నారు. అలాగే, ఇన్స్టిట్యూట్ సారథిగా విద్యార్థుల పోటెన్షియల్‌ను గుర్తించి, ఫార్మస్యూటికల్ టెక్నాలజీ మరియు సృజనాత్మకత యొక్క భవిష్యత్తును రూపొందించడంలో వారికి సహకరించడం కొనసాగిస్తుందని అన్నారు.

## పారంపర్య వైద్యం, ఆయుర్వేద వైద్యం

# ఆధునిక వైద్యంతో సమ్మిళితము చేయాలి





**సాంప్రదాయ ఔషధం పై జరిగిన అంతర్జాతీయ సదస్సు లో వక్తలు**

**బుధవారం ఎస్వీయూ లో ఘనంగా ప్రారంభమైన సాంప్రదాయ వైద్య అంతర్జాతీయ సదస్సు**

**ఆలరిస్తున్న ఎగ్జిబిషన్**

**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర విభాగం, పారంపర్య వైద్య మహా సంఘం సంయుక్తంగా "సాంప్రదాయ ఔషధం : ఆధునిక మరియు సహజ చికిత్సల ఏకీకృత విధానం" అనే అంశంపై ఆచార్య కామాక్షి నిర్వహిస్తున్న మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం వర్సిటీ సెనేట్ హాల్ నందు శ్రీ శక్తి పీఠం పీఠాధిపతి రమ్యానంద భారతి స్వామిని, ఎస్వి వేదిక్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమ్యానంద భారతి మాట్లాడుతూ భారతదేశంలో వృక్షజాతిలో, జీవేతర అంశాలలో ఔషధం గుణాలు వెలికి తీసిన ఘనత ప్రాచీన భారతీయులదని, దానిని ప్రస్తుత వైద్యంలో సమ్మిళితం చేసి ముందుకు తీసుకెళ్లవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని అన్నారు. ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానాలు మన దేశం మర్చిపోయినా పాశ్చాత్య దేశాలు వాటిని ఆచరిస్తున్నాయన్నారు. అదేవిధంగా ఆయుర్వేద,మంత్ర శాస్త్రం ,యజ్ఞ యాగాలు నిర్వహించే సంబంధిత కుటుంబం లో 12 వ తరానికి చెందిన వాడిననీ ఆయన గుర్తు చేసుకున్నారు. ఎన్నారై డా కామేశ్వర రావు బద్రీనాథ్ మాట్లాడుతూ ఆధునిక వైద్యం మరియు ప్రాచీన ఆయుర్వేద వైద్యా విధానం యొక్క అనుసంధానం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ప్రపంచాన్ని వనికించిన కరోనా రోగానికి విరుగుడు కనుగొన్న పారంపర్య వైద్యుడు ఆన్నందయ్య కృషిని గుర్తు చేశారు. తితిదే అటవీ శాఖ అధికారి సెల్వం మాట్లాడుతూ దాదాపు 2000 ఏళ్ళ క్రిందట వున్న ఆయుర్వేద సంబంధిత గ్రంథాలు ప్రస్తుతం అందుబాటులో లేవని, కానీ అడవుల్లో జీవిస్తున్న గిరిజన తెగల కు ఆ వైద్యం గురించి ఇంకా అవగాహన ఉందన్నారు. అడవిలో ప్రతి మొక్క ఆయుర్వేదానికి ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్టేట్ మెడికల్ బోర్డు అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ కృత ,త్రేతా ,ద్వాపర యుగంలో మనుషులు ఆరోగ్యంగా వుండేవారనీ, కానీ కలి యుగం లో మనిషికి ఆరోగ్యం మరియు ఆయుష్షు రెండు తగ్గిపోయాయి దేనికి మూల కారణం పారిశ్రామీకరణ,హైబ్రిడ్ ఉత్పత్తులను వాడడమే అనీ అన్నారు. తితిదే ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రేణు దీక్షిత్ మాట్లాడుతూ రాక్స్ బుర్గీ అనే పాచ్యాత్య శాస్త్రవేత్త భారత దేశ ఆయుర్వేద పండితుల తో కలిసి పశ్చిమ కనుమల్లో ఆయుర్వేద మొక్కలని పరిశోధించి, ఆ వివరాలను గ్రంథస్తం చేసి పట్టుకెళ్లారన్నారు. అదేవిధంగా ప్రస్తుతం చైనా ప్రభుత్వం సాంప్రదాయ చైనీస్ మెడిసిన్ ఆయుర్వేద వైద్య పద్ధతులను ఆచరణ లో కి తీసుకువచ్చి ప్రస్తుత వైద్యంలో సమ్మిళితం చేస్తుందన్నారు. ఎస్వియు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి మాట్లాడుతూ ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను కూకటివేలతో పీకి, సాంప్రదాయ ఆయుర్వేద పద్ధతులను మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు ఆచార్య కామాక్షి, విభాగ అధిపతి ఆచార్య నాగలక్ష్మి దేవమ్మ, ఆచార్య విజయ, అధ్యాపకులు వేణు, అంకన్న, రూపేష్, శివాని, వివిధ రాష్ట్రాలకు చెందిన 400 మంది పారంపర్య వైద్యులు, ఎన్నారైలు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ పెట్రోలు డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

**బద్వేల్ ఏప్రిల్ 9 (ప్రజా జ్యోతి న్యూస్)** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్,పెట్రోలు,డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు గ్యాస్ బండతో శవయాత్ర చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని మాట్లాడుతూ పెట్రోలు,డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి అంతర్జాతీయ ముడి చమురు ధరలకనుగుణంగా ధరలను తగ్గించాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నదన్నారు. రూ.2 లు అదనపు సుంకాన్ని విధించినా ధర పెంచలేదంటూ %ా% ప్రజలను మభ్యపరిచి, మోసపుచ్చుటాన్ని సిపిఐ(ఎం) నిరసిస్తున్నదన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయనీ, అందుకనుగుణంగా ఇక్కడ కూడా పెట్రోలు,డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారాన్ని తగ్గించాల్సింది పోయి ఎక్సైజ్ సుంకాన్ని పెంచి కేంద్ర ప్రభుత్వం తన ఖజానాలో వేసుకోవడం గర్హనీయమన్నారు. పైగా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచలేదని ప్రచారం చేసుకోవడం ప్రజలను మభ్యపరచడమేనన్నారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచి, తగ్గినప్పుడు ధర తగ్గించకపోవడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే లీటరు రూ.2.లు చొప్పున తగ్గించాలని, ఇప్పటికే



పెరిగిన విద్యుత్ చార్జీలను చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజానీకానిపై పుండు మీద కారం చల్లిన చందంగా వంట గ్యాస్ పై ఒకేసారి 50 రూపాయలు పెంచడంతో ప్రజలపై మరింత భారాలు పడనున్నాయని వెంటనే పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని లేకపోతే రానున్న కాలంలో ప్రజా మద్దతుతో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షరీఫ్, గంప అనంతమ్మ, పసుపుల మోక్షమ్మ, శాఖా కార్యదర్శులు షేక్ మస్తాన్ బీ, షేక్ ఆదిల్, ముడియం నరసింహ.నాగార్జున, బాల గురయ్య, ఓబుల్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండండి...

**సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోండి...**

**ఆరోగ్య సూత్రాలను పాటించండి**

**చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**




**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** ఎండలు మండుతున్న దరిమిలా.., వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండి..,ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ.. తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు చిత్తూరు ప్రజలకు సూచించారు. పెరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరులోని సి.యస్.ఐ. చర్చిలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపును చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెడికల్ క్యాంపు నిర్వహించిన పెరికే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పెరికే వరప్రసాద్ ను ఈ సందర్భంగా ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు అభినందించారు. ఉచితంగా పరీక్షల నిర్వహించుకున్న రోగులకు ఆయన మందులను పంపిణీ చేశారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షల నిర్వహించుకొని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, సి.యస్.ఐ. చర్చ్ మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట శ్రీసీతా రాముల కల్యాణానికి తిరుమల లడ్డూ సిద్ధం



**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** ఒంటిమిట్ట శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు సిద్ధమయ్యాయి. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ - 2లో బుధవారం శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్ నిర్వహించారు. డిప్యూటీ ఈవో (జనరల్) శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది మహిళా, పురుష శ్రీవారి సేవకులు 70 వేల లడ్డూలను ప్యాకింగ్ చేశారు. కడపజిల్లా ఒంటిమిట్టలో జరుగుతున్న శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11వ తేదీ సాయంత్రం 6:30 నుంచి 8:30 గంటల మధ్య అత్యంత వైభవంగా జరిగే రాష్ట్ర పండుగ శ్రీ సీతా రాముల కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం మెరుగ్గా చేపట్టాలి. కమిషనర్ ఎన్.మౌర్య





**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 25 వార్డులో గల కర్ణాల వీధి, అరవల్లి వీధి, వేశాలమ్మ గుడి వీధి, బలిజ వీధి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వస్తున్న పారిశుద్ధ్య పనులు బాగా చేపట్టాలని అన్నారు. ప్రతి వీధిలో చెత్త వాహనం వచ్చేలా చూడాలని అన్నారు. నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ భారత్ లో తిరుపతి ముందుస్థానంలో ఉండేలా ప్రజలు సహకరించాలని అన్నారు. ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ జరుగుతోందని అనరు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని అన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ నరసింహచారి, మునిసిపల్ ఇంజినీర్ తులసి , హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ రాజు, ఏసిపి బాలాజీ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

# ఘనంగా 42వ వార్షికోత్సవ వేడుకలు

**ఏప్రిల్ 9,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో బుధవారం 42వ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలోకళాశాల జీవితం ప్రత్యేకమైన రోజని తెలిపారు.తల్లిదండ్రులను గౌరవించడంతో పాటు, క్రమశిక్షణతో బాధ్యతగా మెలగాలని తెలిపారు. రాబోయే డిగ్రీ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. స్నేహం నిస్వార్ధమైందని, మంచి స్నేహితులను కలిగి ఉండడం అదృష్టమని అన్నారు..కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు. ఎమ్మెల్యే సహకారంతో కళాశాల పురోభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాల సాధించినటువంటి విజయాలను తెలియజేశారు..ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణాన్ని రంగురంగుల పూలు, బెలూన్లతో అలంకరించారు. విద్యార్థినీ విద్యార్థులు ఆధునిక, సంప్రదాయ వస్త్రాలతో కనివిందు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య, స్టూడెంట్ వైస్ ప్రెసిడెంట్ వి.వీరయ్య, డాక్టర్ పి, సుజనా,టి. నరసింహులు, డాక్టర్ వెంకట కృష్ణయ్య, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ, డాక్టర్ ఏ. దేవకి తదితర అధ్యాపకులు, విద్యార్థిని



విద్యార్థులు పాల్గొన్నారు..స్థానిక ప్రముఖులు గంజి మాధవయ్య, జీవరత్నం నాయుడు, నారాయణ బాబు, పోలీస్ ఇన్స్పెక్టర్ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు..వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# వైసీపీ ఐదేళ్లు ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారు...

ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర...

ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావెరి సమావేశ మందిరం నందు ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజి %డ% ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హాజరయ్యారు. సమీక్షా అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలోని ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం కమిషనర్ మరియు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ తో కలిసి ముందుకు వెళ్ళాల్సిన విధానంపై నేడు చాలా విస్తృతంగా సమీక్ష చేసుకున్నాం.2014-19 మధ్య ప్రజలకు ఇబ్బంది లేని విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి అమలు చేశాం. 2019- 24 మధ్య కాలంలో వైసీపీ ఐదేళ్లు ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారని ధ్వజమెత్తారు. జగన్ మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చి.. మద్యం వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారని అన్నారు. కొత్త పాలసీ పేరుతో వ్యవస్థ మొత్తాన్ని విచ్ఛిన్నం చేశారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని డిస్టిలరీల నుండి మద్యం షాపుల వరకు మొత్తాన్ని హస్తగతం చేసుకుని ఎన్ ఫోర్సు మెంట్ లేకుండా చేసి మద్యం అక్రమ వ్యాపారాలకు తెరలేపారన్నారు. వైసీపీ మల్టీ నేషనల్ బ్రాండ్స్ మొత్తాన్ని మార్కెట్ నుంచి దూరం చేసి, తమ సొంత బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజల నెత్తిన రుద్దారని పేర్కొన్నారు.గత ప్రభుత్వం



అమలు చేసిన మద్యం విధానంతో ప్రభుత్వ ఆదాయం.. ప్రజల ఆరోగ్యం రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. సరిహద్దు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరగగా మన రాష్ట్రంలో మద్యం ఆదాయం తీవ్రంగా కోల్పోయాం నాసిరకం సొంత బ్రాండ్ల కారణంగా లక్షల మంది అనారోగ్యం బారిన పడగా, పలువురు కిడ్నీ, లివర్ సమస్యల బారిన పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ ద్వారా నాసిరకం బ్రాండ్లకు స్వస్తి పలకడం జరిగిందని 6 రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టాం అన్నారు.

## ఆలయ పూజారి వీరన్న స్వామి ఆధ్వర్యంలో

# ముగిసిన రాష్ట్ర స్థాయి భజన పోటీలు





**ప్రజా జ్యోతి తుగ్గలి 09న** రాష్ట్రస్థాయి భజన పోటీలు తుగ్గలి మండలంలోని మామిళ్ల కుంట గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ వీర నాగ లింగేశ్వర స్వామి 34వ ఆరాధన మహోత్సవాలు ఆ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ వీర నాగమంబ సమేత శ్రీశ్రీశ్రీ వీర నాగలింగేశ్వర స్వామి దేవాలయము నందు పూజారి వీరన్న స్వామి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ప్రజలు సమక్షంలో భక్తాదులతో కలిసి ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారుబుధవారం 08వ తేదిన రాత్రి 10:30 గంటలకు రాష్ట్రస్థాయి భజన పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతిగా శ్రీ లక్ష్మీనరసింహ భజన బృందం గుర్రంపాడు రూ.15000/- వేలు, ద్వితీయ, బహుమతులుగా శ్రీ సాయి సరస్వతి భజన బృందం లక్ష్మి పల్లి రూ. 13000/- వేలు, తృతీయ మారుతి భజన బృందం కొత్తూరు రూ. 11000/-వేలు నాలుగో శ్రీ ఆంజనేయ స్వామి భజన బృందం హాలిగెరి బహుమతి 9000/-ఐదవ బహుమతి 7000/-ఆరవ బహుమతి 500/-ఏడవ బహుమతి 4000/- 8వ బహుమతి 300/-తొమ్మిదవ బహుమతి 2000/- బహుమతులు ఉత్తమ హార్మోనిస్ట్ అశోక్ నాయుడు, ఉత్తమ తబలా ఇష్టం ధనుంజయ, ఉత్తమ గాయకుడు హాలిగేరి రవి, ప్రదానం చేశామని ఆలయ నిర్వాహకులు పూజారి వీరన్న స్వామి తెలియజేశారు.

## కూటమి పాలనలో పేదోడి ఆరోగ్యానికి భరోసా లేదు

– ఆరోగ్య శ్రీ సేవలు అందక పేదలకు ఇక్కట్లు

– గొర్లె సూర్యారావు కుటుంబ పరామర్శలో కిల్లి వెంకట సత్యన్నారాయణ

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** కూటమి పాలనలో పేదోడి ఆరోగ్యానికి భరోసా లేదని వైకాపా రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యన్నారాయణ అన్నారు. పొందూరు పంచాయతీ ఎరుకల కాలనీ కు చెందిన ఉత్తరాంధ్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు గొర్లె సూర్యారావు తండ్రి గొర్లె లక్షణ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వైకాపా రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యన్నారాయణ,వైసిపి నాయకులు,మాజీ మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ , ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద్ , బాదాన కృష్ణ , చింతకాయల వాసు , అనకాపల్లి వాసు ,పలువురు కార్యకర్తలు సూర్యారావు కుటుంబాన్ని పరామర్శించారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుత కూటమి తీరును విమర్శించారు. సామాన్య , పేద ప్రజల జీవితాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారన్నారు.దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతీ ఒక్క పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో అమలులోకి తెచ్చిన ఆరోగ్య శ్రీ సేవలు ప్రస్తుత కూటమి హయంలో నిలిచిపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన ఆరోగ్య శ్రీ



పథకాన్ని ఆయన తనయుడు వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగించారన్నారు. ప్రతీ ఒక్క పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కానీ కూటమి పాలనలో పేదవాడి ఆరోగ్యానికి భరోసా లేదని , తక్షణమే పెండింగ్ లో ఉన్న బకాయిలను చెల్లించి , ప్రజా ఆరోగ్యం పై దృష్టి సారించాలని కోరారు.

## రైతులందరూ పంట కోత ప్రయోగానికి హాజరై పంట దిగుబడులను తెలుసుకోవాలి



**తూర్పుగోదావరిజిల్లా , తాళ్లపూడి మండలం,ఏప్రిల్9, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో సర్వే నెంబర్ 317/1%ా% లో పండించినమొక్కజొన్న డెకల్బ్ 9217 విత్తనం పంట కోత ప్రయోగం ఎలకల కనకం అనే రైతు పొలం లో జరిగినట్లు ఏ.ఈ.ఓ జోడాల వెంకట్ అన్నారు. దిగుబడి ఎకరాకు సుమారుగా 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు ఆయన అన్నారు. జోడాల మాట్లాడుతూ. తాళ్లపూడి మండలం మొత్తం గా వరి.48,మొక్కజొన్న 8 పూగాకు 4 ,పంట కోత ప్రయోగాలు ఈ రబీ సీజన్ లో చేస్తున్నాం అని ఇప్పటి వరకు 20 శాతం ప్రయోగాలు అయ్యాయి అని సరాసరి 45 బస్తాలు వరి దిగుబడి వస్తుంది అని రైతులు ప్రయోగాలకు హాజరై వారి పంట దిగుబడులను తెలుసుకోవాలి అని అన్నారు. అదే విధముగా ఉదయం 11 లోపు ప్రయోగాలలో పాల్గొనాలని కోరారు. ఎంత శ్రీవత దృష్టిలో పెట్టుకొని రైతులు, వ్యవసాయ సహాయకులు ఉదయం ఫీల్డ్ లో ఉన్నట్లు ఐతే వడ దెబ్బ తగలకుండా ప్రయోగాలను పూర్తి చేసుకోవచ్చు అని సూచించారు.ఈ కార్యక్రమం లో రైతు సుధాకర్, వ్యవసాయ సహాయకులు పోతమ్మ , గౌతమి పాల్గొన్నారు

## భూ యజమానులు అందరూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి జిల్లా సర్వేయర్



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్9, ప్రజా జ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలంగజ్జరం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 2 వ దశ రీ సర్వే పై అవగాహన నిమిత్తం గ్రామ సభ నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సర్వేయర్ బి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ గ్రామ సభలో రీ సర్వే నందు గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియలో మీ యొక్క భూ సమస్యలు అనగా సర్వే నెంబర్లు తప్పుగా నమోదు అయి ఉండటం, ఒక సర్వే నెంబర్ ఆన్లైన్ అయి ఉండి భూమి మీద వేరే నెంబర్ లో ఉండటం,చనిపోయిన వారి పేరు మీద ఉన్న భూములు వారి కుటుంబ సభ్యులకు మ్యుటేషన్ ద్వారా పేర్లు మార్పుటకు ఇలాంటి మొదలైన సమస్యలు ఈ యొక్క రీ సర్వే నందు పరిష్కారం అవుతాయని, కావున పొలం ఉన్న రైతులు అందరూ ఈ రీ సర్వే కి సహకరించి మీ యొక్క సమస్యలుపరిష్కరించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ టి.వెంకటేశ్వరరావు, ఇంచార్జ్ తాహసీల్దార్ పి. మోహనభారతి, మండల సర్వేయర్ పి సత్యనారాయణ, గ్రామసర్పంచ్ గండిరాంబాబు, ఉప సర్పంచ్ దండమూడి శేషు,ఎం.పి.టి.సి గుంటు చిన్నబ్బాయి ,వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, కూటమి నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన తిరుపతి పార్లమెంట్ శాలివాహన అధ్యక్షులు.

**ఏప్రిల్ 9(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి పర్యటనలో ఉన్న ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను తిరుపతి పార్లమెంట్ శాలివాహన అధ్యక్షులు ఆముదాల తులసీదాస్ తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కొల్లు రవీంద్రను సాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ



నేపధ్యంలో తిరుపతి పరిధిలో శాలివాహనులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహాయ పడవలసినదిగా విన్నవించారు. అలాగే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తున్న నేపథ్యంలో తన పేరును కూడా పరిశీలించవలసిందిగా విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి నరసింహ యాదవ్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ రుద్రకోటి సదాశివమ్ , శాలివాహన సభ్యులు కృష్ణ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాములోరి కళ్యాణానికి ఏపీ టూరిజం కొత్త ప్యాకేజీ...

**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** ఒంటిమిట్ట శ్రీకోదండ రామ స్వామి పౌర్ణమి కళ్యాణం సందర్భంగా కొత్త ప్యాకేజీ టూర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సి.హెచ్. శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్యాకేజ్ టూర్ వివరాలు ఇలా ఉన్నాయి ఏప్రిల్ 11 వ తేది .ఒక మనిషి కి రూపాయలు: 600.00 చొప్పున(నాన్ ఏసీ బస్, గైడ్ సౌకర్యము తో కలిపి).బస్సు ఉదయం 8 గంటలకు శ్రీనివాసం,విష్ణునివాసం(టిటిడి). నుండి బయలుదేరునని అన్నారు.మరిన్ని వివరాలకు 08772289123,9848007033. ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.



# కూటమి పాలనలో పేదోడి ఆరోగ్యానికి భరోసా లేదు

**ఆరోగ్య శ్రీ సేవలు అందక పేదలకు ఇక్కట్లు**

**గొర్లె సూర్యారావు కుటుంబ పరామర్శలో కిల్లి వెంకట సత్యన్నారాయణ**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** కూటమి పాలనలో పేదోడి ఆరోగ్యానికి భరోసా లేదని వైకాపా రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యన్నారాయణ అన్నారు. పొందూరు పంచాయతీ ఎరుకల కాలనీ కు చెందిన ఉత్తరాంధ్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు గొర్లె సూర్యారావు తండ్రి గొర్లె లక్ష్మణ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వైకాపా రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యన్నారాయణ,వైసిపి నాయకులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ , ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద్ , బాడాన కృష్ణ , చింతకాయల వాసు , అనకాపల్లి వాసు ,పలువురు కార్యకర్తలు సూర్యారావు కుటుంబాన్ని పరామర్శించారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుత కూటమి తీరును విమర్శించారు. సామాన్య , పేద ప్రజల జీవితాలతో చంద్రబాబు చెలగాటం అడుగుతున్నారన్నారు.దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతీ ఒక్క పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో అమలులోకి తెచ్చిన ఆరోగ్య శ్రీ సేవలు ప్రస్తుత కూటమి హయంలో నిలిచిపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన ఆరోగ్య శ్రీ పథకాన్ని ఆయన తనయుడు వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగించారన్నారు. ప్రతీ ఒక్క పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించిన ఘనత ఆయనకే దక్కుతందన్నారు. కానీ కూటమి పాలనలో పేదవాడి ఆరోగ్యానికి భరోసా లేదని , తక్షణమే పెండింగ్ లో ఉన్న బకాయిలను చెల్లించి , ప్రజా ఆరోగ్యం పై దృష్టి సారించాలని కోరారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరుపతి నగరంలో ఘనంగా జరిగాయి.భారతీయ జనతా పార్టీ 45 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరుపతిలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు . భారతీయ జనతా పార్టీ తిరుపతి నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో తిరుపతి లీలామహల్ సెంటర్ శ్రీకృష్ణదేవరా ంంంంయుల కూడలి వద్ద అలాగే కొర్లగుంట టి.ఎం.ఆర్ కళ్యాణ మండపం వద్ద జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు ఎంపీ సీట్లతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా ఆవిర్భవించడం తామందరూ ఆ పార్టీలో నాయకులుగా ఎదగడం సంతోషంగా ఉందన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ, వాజ్పేయి, ఎల్కే అద్వానీ ,నరేంద్ర మోడీ మొదలగు ముఖ్య నాయకులు బిజెపి అభ్యున్నత కోసం ఎనలేని కృషి చేశారని తమ జీవితాలను దారబోశారని కొనియాడారు .వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉంటూ దేశ భవిష్యత్తు పరమావిధిగా బిజెపి నాయకులు పనిచేస్తామన్నారు. ముఖ్యంగా నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక మన దేశం అన్ని రంగాలలో సూపర్ పవర్ గా ఎదుగుతుందని కొనియాడారు .ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి ,బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్ , బిజెపి నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు బిజెపి సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్ మల్ల కుప్పం శేఖర్ నరసింహ యాదవ్ కిరణ్ ఈశ్వర్ చంగల్ రాయలు భూషణ్ రెడ్డి బిజెపి సెంట్రల్ మండల ప్రధాన తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి విద్వాన్ కస్పా పద్మనాభం బిజెపి తదితరులు పాల్గొన్నారు.



## చంద్రగిరి మండలంలో దారుణం...

కలకలం రేపిన పరువు హత్య...

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి), తిరుపతి జిల్లా ప్రతినిధి** చంద్రగిరి మండలం నరసింగాపురంలో దారుణం జరిగింది. పరువును కాపాడుకోవడం కోసం కన్న బిడ్డను బలి చేసిన తల్లిదండ్రులు. కన్న బిడ్డ ప్రాణం కన్నా పరువుకే విలువనిచ్చిన తల్లిదండ్రులు వివరాలు ఇలా ఉన్నాయి...మిట్టపాలెం ఎస్సీ కాలనీకి చెందిన అజయ్ అనే వ్యక్తిని నిఖిత అనే మైనర్ బాలిక ప్రేమించింది. 17సంవత్సరాల నిఖిత గర్భవతి కావడంతో తల్లిదండ్రులు అబార్షన్ చేయించారు. ఏడాది క్రితం తల్లితండ్రుల ఫిర్యాదుతో అజయ్ పై ఫోక్స్ కేసు నమోదు చేసి జైలుకు పంపించారు పోలీసులు. నిఖిత అజయ్ ని తరచూ కలుస్తూ ఉండటం ఇంట్లో తెలియడంతో నిఖితను వేదింపులకు గురిచేసి కలవకూడదని ఆంక్షలు విధించారు. శుక్రవారం నిఖిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో గంటల వ్యవధిలోనే మృతదేహాన్ని దహనం చేసారు తల్లిదండ్రులు. దీంతో గ్రామస్తుల ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు సుజాత, కిషోర్ నిఖితను హత్య చేశారా..? ఆత్మహత్య చేసుకుందా అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. పోలీసు దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## బైరాగి పట్టెడ ఇల్ల మధ్యలో ఏర్పాటుచేసిన వైన్ షాపును తొలగించండి.

**ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గారికి వినతిపత్రం ఇచ్చిన సిపిఐ నాయకులు.**




**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** బైరాగి పెట్టడ, సాయి నగర్ ఇల్ల మధ్యలో ఏర్పాటు చేసిన వైన్ షాప్ ను తక్షణమే తొలగించాలని సిపిఐ నాయకులు కోరారు. ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు మహిళా యూనివర్సిటీలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లి రవీంద్రకి సిపిఐ నాయకులు వినత పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ మాట్లాడుతూ బైరాగి పట్టెడ సాయి నగర్ పంచాయతీ వద్ద ఇళ్ల మధ్య, హాస్పిటల్స్, గర్ల్స్ హాస్టల్, స్కూల్ మధ్యలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్లీ వైన్ షాప్ ను తక్షణమే రద్దు చేయాలని, రెండు నెలలగా స్థానిక మహిళలు విద్యార్థులు వ్యతిరేకిస్తున్న ఫ్రెండ్లీ వైన్ షాప్ మాత్రం మూయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కొద్దిరోజుల పాటు కలెక్టర్ జోక్యం చేసుకొని మూసివేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో వైన్ షాప్ వారిచ్చే ముడుపులకు అమ్ముడుపోయి మళ్ళీ ఫ్రెండ్లీ వైన్ షాప్ తెరిపించారని మంత్రివర్యులకు వివరించారు. మంత్రివర్యులు స్పందిస్తూ తక్షణమే విచారణ చేర్పించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్న పెంచలయ్య, కే రాధాకృష్ణ, నగర కార్యవర్గ సభ్యులు ఎన్డీ రవి ,పద్మాపు రెడ్డి, రామకృష్ణ, పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వం కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు ఏప్రిల్ 9 (ప్రజా జ్యోతి):ఇటీవల తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టత్మాకంగా చేపట్టి కోటి కి పైగా సభ్యత్వా లు నమోదు చేసి రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే ఈసందర్భంగా కేంద్ర పార్టీ కార్యాలయం నుండి సభ్యత్వం కార్డులు నియోజకవర్గం శాసన సభ్యులుగుమ్మనూరు జయరాంకి అందించడం జరిగింది. బుధవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పట్టణం లోని టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలకు సభ్యత్వం కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఈసందర్బంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ పార్టీ కోసం ఎండనక వాననక తిరిగి పార్టీ ని అధికారం లోకి తేవడానికి కృషి చేసిన ప్రతి పార్టీ కార్యకర్తకునా హృదయ పూర్వక ధన్యవాదములు అని కచ్చితంగా అందరిని గుర్తు పెట్టుకుని వారికి తగిన గుర్తింపునిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో గుంతకల్లు టిడిపి పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, అనంతపురం పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు, యాదవ సంఘం రాష్ట్ర డైరెక్టర్ ఆమ్లెట్ మస్తాన్ యాదవ్,తలారి.మస్తానప్ప, అంజి,యుగంధర్,చికెన్ జగన్నాథ్,నగరడోణ. రవికుమార్, గుజిరి ఖాజా, ఆటో ఖాజా, నగరడోణ.వీరేష్, మధు,ఎస్.మల్లేష్,లక్ష్మీ నారాయణ,ఓ.చంద్రయ్య, మాత్ర నాయక్, టిడిపి మహిళా నాయకురాలు అంజలీదేవి మరియు టిడిపి పట్టణ,మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి....

**కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు అద్దంకి నాగర్జున యాదవ్.....**



**ప్రజా జ్యోతి తుగ్గలి :** బిజెపి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ కు పెంచిన రూ.50ను తక్షణమే ఉప సంహరించుకోవాలని తుగ్గలి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అద్దంకి నాగర్జున యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వరసగా నిత్యవసరాలు ధరలు పెంచుతూ బిజెపి ప్రభుత్వం ప్రజలపై బాదుడు మొదలుపెట్టిందని అయన మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని ఆయన కోరారు.

## సనపల తిరుపతి రావు కుటుంబానికి పరామర్శ



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** రిటైర్డు డి.ఎం.హెచ్. ఓ డాక్టర్ సనపల తిరుపతి కుటుంబాన్ని వైకాపా నాయకులు బుధవారం నాడు పాత బస్టాండ్ సమీపంలో తన స్వగృహం వద్ద పరామర్శించారు. తిరుపతి రావు అత్త మొదలవలస కృష్ణవేణి ఆనారోగ్యంతో మృతి చెందడంతో వైకాపా రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యన్నారాయణ, వైసిపి నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ , ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద్ , బాడాన కృష్ణ , చింతకాయల వాసు, ఏపియం గురుగుబెల్లి శ్యామల రావు పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సానుభూతి వ్యక్తం చేశారు.

## ఘనంగా ఆర్డిటి వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** పామిడి పట్టణంలోని స్థానిక నాలుగో వార్డ్ పిఎండి(%ూవీణ%) కాలనీ నందు రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 105 వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ముందుగా సి ఓ వరలక్ష్మి,ఆర్డిటి కౌన్సిలర్ సునీత ఆధ్వర్యంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కాలనీ వాసులంతా వారు ఏర్పాటు చేసుకున్న హుండి లను పగలగొట్టి అందులో ఉన్న రూపాయలను ఆర్డిటి వారికి అందజేశారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి రోజున ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమము ద్వారా వచ్చిన నిధి ని అనాధ పిల్లలకు విద్య, ఆరోగ్య సంరక్షణ కోసం ఉపయోగిస్తామని సి ఓ వరలక్ష్మి, ఆర్డిటి కౌన్సిలర్ సునీత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబిటి ప్రియాంక, సి డి సి మెంబర్లు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తుగ్గలిమండలంలో చెత్తబుట్టల పంపిణీలో నిర్లక్ష్యం



**ప్రజా జ్యోతి తుగ్గలి:** మండలంలోని గ్రామాలలో ప్రతి పంచాయితీకి ఇంటింటికి తడి చెత్తకు 1 పొడి చెత్తకు 1 చొప్పున ప్రతి కుటుంబానికి 2 చెత్త బుట్టలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే తుగ్గలి మండలంలోని కొన్ని గ్రామాలలో కుటుంబానికి 1 చొప్పున పంపిణీ చేయడం మరి కొన్ని గ్రామాలలో కేవలం పబ్లిసిటీ కోసం కొన్ని పంపిణీ చేసి మొత్తం గ్రామంలో ప్రతి కుటుంబానికి రెండు చొప్పున పంపిణీ చేసినట్లు ప్రచారం చేస్తున్నారు. అసలు విషయానికి వస్తే కొన్ని గ్రామాలలో చెత్త బుట్టలు పంపిణీ చేయలేదని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుంటే ఇక్కడి అధికారులు, కొంతమంది గ్రామ నాయకులు వాటిని తుంగలో తొక్కుతున్నారు.ఈ విషయమై ఈ.ఓ.ఆర్.డి శ్రీ హరి ని వివరణ కొరటానికి ఫోన్ చెయ్యగా ఆయన స్పందించకపోవడం పట్ల అనుమానాలు మరింత బలమైతున్నాయని ప్రజల నుండి ఆదికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రతి పంచాయతీలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించే పథకాలు అందుతున్నాయా లేదా అని విచారించి అవినీతికి పాల్పడుతున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల పై తగిన చర్యలు తీసుకోవాలని లేదంటే ఇదే విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ప్రజల తెలిపారు.

## పూతలపట్టు నియోజకవర్గ అభ్యున్నతి కోసం

# అహర్నిశలు శ్రమిస్తున్నాం

మ్యాంగో బోర్డును సాధించే వరకు విశ్రమించం

మామిడి పల్ప్ ను కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలని టీటీడీని కోరాం

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్



**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** పూతలపట్టు నియోజకవర్గం అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్...

మరీ ముఖ్యంగా.... పూతలపట్టు నియోజకవర్గం మామిడి పంటకు ప్రసిద్ధి అని..,ఈ నేపథ్యంలోనే మామిడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మ్యాంగో బోర్డును సాధించాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నట్లు వారు తెలిపారు. అదేసమయంలో మామిడి పల్ప్ కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలని టీటీడీని కోరినట్లు చెప్పారు. పూతలపట్టు నియోజకవర్గం,ఐరాల మండలం,గుండ్లపల్లె గ్రామ పంచాయతీ, వెంకటాపురం,ఎస్.డ్ల్యూ.., శ్రీ రామ తీర్థ సేవాశ్రమం,పేయన్న గారి పల్లె ఏడ్ల్యూ, జీ.గొల్లపల్లె బస్ స్టాప్ టు పరిసర ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, అంగన్వాడీ కేంద్రం కాంపౌండ్ వాల్, గ్రావెల్ రోడ్లను బుధవారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సి.ఆర్.రాజన్.., ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, ఐరాల మండలం టిడిపి మండలాధ్యక్షుడు గిరి నాయుడు, మాజీ జడ్పిటిసి లత, టీడీపీ నేత గిరినాయుడు, పార్టీ మహిళా నాయకురాలు చందన స్రవంతి, జనసేన నేత పురుషోత్తం, మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివ .. కూటమి నాయకులు వాసు, మదనమోహన్, నవీన్, చందు, గణేష్, కిషోర్, మహాలక్ష్మి తదితరులతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు గుండ్లపల్లె పంచాయతీకి చేరుకున్న అతిథులకు ఐరాల మండలం కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా చూస్తూ అందుకు అనుగుణంగా పనిచేస్తున్నారని చెప్పారు. సీ.యం. బాటలోనే తాము కూడా నడుస్తూ.. తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నామని తెలిపారు. పల్లె ప్రాంతాల ప్రగతి కోసం పాటుపడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన పై దృష్టి సారించి, నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఆధునిక యుగంలో ప్రబలే రోగాల బారి నుంచి ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అందుకోసం చిత్తూరు పార్లమెంటులో ప్రాంతీయ ఆరోగ్యాల కేంద్రాల పనితీరును మెరుగుపరుస్తున్నామన్నారు.

ప్రజా సంక్షేమం కోరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరిచిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వ్యక్తిగతంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం కూడా పురోభివృద్ధి వైపు పయనిస్తుందని చిత్తూరు ఎంపి అభిప్రాయపడ్డారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ.. పూతలపట్టు నియోజకవర్గ అభ్యున్నతి కోసం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., తాను ఐక్యంగా పనిచేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే తమ అజెండా అన్నారు. పచ్చని పల్లె ప్రాంతాలన్నీ ప్రగతివైపు నడిపించాలన్నదే తమ అభిమతమన్నారు. ఇప్పటికే కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసి, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు..

ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సి ఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, ఐరాల మండలం టిడిపి మండలాధ్యక్షుడు గిరి నాయుడు.. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ కృషిని కొనియాడారు. అదే సమయంలో మ్యాంగో రైతులను ఆదుకోవాలని, మ్యాంగో పల్ప్ ను టీటీడీ కొనుగోలు చేసేందుకు సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించారు. మామిడి పల్ప్ విషయాన్ని ఇప్పటికే కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్లినట్లు చెప్పారు.

**తోటవారిపల్లెలో బస్సు షెల్టర్ను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు..**

పూతలపట్టు నియోజకవర్గం, పూతలపట్టు మండలం, పాటూరు పంచాయతీ, తోటవారిపల్లెలో నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్ ను చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సి.ఆర్. రాజన్ ,పూతలపట్టు మండలం టిడిపి మండలాధ్యక్షుడు దొరబాబు, ఎంపీపీ మురళీ,ఎంపీటీసీ బాలకృష్ణమ నాయుడు, టీటీడీ సీనియర్ నేతలు చంద్రమౌళి,గోపి, క్లస్టర్ ఇంచార్జ్ రవి, కార్యక్రమ నిర్వాహకులు మురళి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**యాదమర్రి మండలంలో సీసీ రోడ్లను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు**

పూతలపట్టు నియోజకవర్గం, యాదమర్రి మండలం, దాసరా పల్లి పంచాయతీ, మొలకల మరుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ల శిలాఫలకాన్ని బుధవారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలిగిరి మురళీమోహన్, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సి.ఆర్ రాజన్ , కార్యక్రమ నిర్వాహకులు భరణి, కూటమి నాయకులు, కార్యకర్తలు నాయకులతో కలిసి ప్రారంభించారు...

## చంద్ర రాజేశ్వరరావు జీవితం ఆదర్శం




**బద్వేల్ ఏప్రిల్ 9 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణం లోని సి.ఆర్. నగర్ లో స్వాతంత్ర సమరయోధులు కమ్యూనిస్టు దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సభ జరిగింది. ఈ సభను ఉద్దేశించి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు వి. వీరశేఖర్ మాట్లాడుతూ ధనికుడు జమీందారు కుటుంబానికి చెందిన ఈయన తన యొక్క వ్యక్తిగత జీవితాన్ని ఫణంగా పెట్టి పేద. బడుగు. బలహీన. వర్గాల ప్రయోజనాల కోసం తన యొక్క సొంత ఆస్తులను సైతం ప్రజలకు పంచిపెట్టి నికార్సైన కమ్యూనిస్టు జీవితం గడపారని ఆయన కొనియాడారు. పెత్తందారి విధానం కు వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు అందరినీ ఏకం చేసి ఇల్లు.భూమి. లేని పేదలను ఐక్యపరిచి భూ పోరాటాలు నిర్వహించి ఆద్యుడు అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పెద్దలపల్లి బాలు. జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ. నల్లిపోగు నాగేశం. రామసుబ్బారెడ్డి. చేజర్ల రవి. నరసయ్య. భాష. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు,

## ప్రమాదవశాత్తు బట్టల వ్యాపారి మృతి

- ధర్మపురం బావిలో లభ్యమైన మృతదేహం
- గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. పొందూరు పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారి ఉండ్రాళ్ళ కిషోర్ కుమార్ (50) ప్రమాదవశాత్తు మృతి చెందారు.వివరాల్లోకి వెళ్తే పొందూరు పట్టణం లో ఉండ్రాళ్ళ కిషోర్ ఎన్నో ఏళ్లుగా బట్టలు వ్యాపారం చేస్తున్నాడు. ఈయన భార్య అనసూయ , వీరికి ఒక కుమార్తె ,కుమారుడు. మంగళవారం కుటుంబ సమేతంగా రాములవారి కళ్యాణ మహోత్సవం కిషోర్ పాల్గొన్నారు. అనంతరం పని మీద ధర్మపురం వెళ్లిన తన భర్త తెల్లవారిన ఇంటికి రాలేదని అనసూయ స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. ఈమె పిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో ఉన్న పోలీసులకు ధర్మపురం గ్రామస్తులు బావిలో ఎవరో చనిపోయి ఉన్నారని సమాచారం అందజేశారు.స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతదేహాన్ని ఉండ్రాళ్ళ కిషోర్ గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కిషోర్ భార్య పిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. కిషోర్ మంగళవారం రాత్రి బాకీ వసూలు చేసేందుకు ధర్మపురం గ్రామానికి వెళ్ళాడని , పొరపాటున కాలుజారి పడిపోయి ఉంటాడని పిర్యాదు లో అతని భార్య ఉండ్రాళ్ళ అనసూయ పేర్కొన్నట్లు ఎస్. ఐ సత్యన్నారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.మృతదేహాన్ని బావిలో నుండి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు.

## చెత్త సేకరణ ట్రాక్టర్ ను బహుకరించిన ఠాగూర్ ల్యాబొరేటరీస్ యాజమాన్యాన్ని అభినందించిన ఎమ్మెల్యే





**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్9,ప్రజా జ్యోతి న్యూస్** పోచవరం గ్రామపంచాయతీకి చెత్త సేకరణకోసం అడిగిన వెంటనే స్పందించి. ఠాగూర్ ఫ్యాక్టరీ వారు సామాజిక సేవా దృక్పథంతో %జూ=% బాధ్యతగా సుమారుగా 9 లక్షల విలువ గల మహేంద్ర ట్రాక్టర్ మరియు టూ వీలర్ లిఫ్ట్ ట్రక్ ను పోచవరం గ్రామ పంచాయతీకి కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీద గా పంచాయతీకి బహుకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా అనేకమందికి. సేవాకార్యక్రమాల ద్వారా ప్రయోజనాలు పొందారని అడిగిన వెంటనే స్పందించి ట్రాక్టర్ ను బహుకరించిన ఠాగూర్ లేబొరేటరిస్ అధినేత రమేష్ మరియు సుబ్రహ్మణ్యం రాజు బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఇలాంటి పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి టాక్స్ ల రూపంలో ఆదాయం చెల్లించడమే కాకుండా ఆ చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల వారికి ఉపాధి అవకాశాలు కూడా కలుగుతున్నాయని గత ప్రభుత్వంలో పరిశ్రమ రావాలంటే వాళ్లకు కప్పం కట్టలేక వెనక్కి వెళ్ళిపోయాయని కానీ కూటమి ప్రభుత్వంలో కొత్తగా నిర్మించుకునే పరిశ్రమలకు అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

# విజనరీ నాయకుడు చంద్రబాబు

అమెరికాలో లక్షల్లో ఐటీ రంగంలో తెలుగువాళ్లు

తెలుగువాళ్ళ అభివృధికి ప్రోత్సహించిన నాయకుడు చంద్రబాబు

రాష్ట్ర అభివృద్ధికి ఎన్నారైలు మద్దతు ఇవ్వాలి

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలి

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ఛార్లెట్లో ఘనంగా టిడిపి ఎమ్మెల్యేల మీట్ అంట్ గ్రీట్

పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్,మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి




ఆమదాలవలస ,ప్రజా జ్యోతి న్యూస్:

నేడు అమెరికాలో లక్షలమంది తెలుగువారు ఐటీ రంగంలో ముందంజలో ఉన్నారంటే అందుకు టిడిపి అధినేత , ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కారణమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. చార్లెట్ లోని వెడ్డింగ్టన్ రోడ్డు లో బావార్చి ఇండియన్ గ్రిల్ రెస్టారెంట్ లో ఎన్నారై టీడీపి నాయకులు , ఎమ్మెల్యేలు మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్,మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోనే పార్టీ 43వ ఆవిర్భావదినోత్సవ వేడుకలను కూడా నిర్వహించారు. వర్కింగ్ డే అయినప్పటికీ దాదాపు రెండు వందల మంది ఛార్లెట్ ఎన్నారైలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీని అప్పటి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎన్టీరామారావు స్థాపించారన్నారు.సినిమానటుడి పార్టీ అన్నవారే చివరకు ఈ పార్టీలో చేరి అధికారాన్ని అందుకున్నారని చెప్పారు..ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ ఏ రాజకీయవేత్తకి లేదని ఆయన తన ప్రసంగంలో ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్లో మళ్ళీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు ఎన్నారైలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్నికల సమయంలో పార్టీని గెలిపించేందుకు ముందుకువచ్చినట్లే రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిబాటలో పయనింప చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతికోసం పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని కోరారు. వీరితో పాటు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కూడా ఎన్నారైలు రాష్ట్ర ప్రగతికోసం ముందుకురావాలని కోరారు. చంద్రబాబు చేస్తున్న పనులకు, పథకాలను మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఛార్లెట్ ఎన్నారై టీడీపీ స్థానిక నాయకులు నాగ పంచుమర్తి, ఠాగూర్ మల్లినేని, రమేష్ ముకుళ్ళ, సతీష్ నాగభైరవ, రాజేష్ వెలమల మరియు ఇతర ఎన్నారై టీడీపీ కార్యవర్గ సభ్యులు సమన్వయపరచారు.ఈ కార్యక్రమంలో ఎన్నారై టీడిపితోపాటు, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొబైల్లో శక్తి యాప్ ఉంటే రక్షణగా పోలీసులు మీ వెంట ఉన్నట్లే

**భద్రతతో కూడిన ప్రయాణానికి భరోసాగా జిల్లా ఎస్పీ**



**బాపట్ల జిల్లా ఏప్రిల్ 9( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** మొబైల్లో శక్తి యాప్ ఉంటే రక్షణగా పోలీసులు మీ వెంట ఉన్నట్లేనని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బుధవారం జిల్లాలోని శక్తి బృందాలు వారి పరిధిలోని కళాశాలలో, పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్ లు, బస్టాండ్ లు, ప్రధాన కూడళ్ళు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో మహిళలకు, విద్యార్థిని లకు శక్తి యాప్ ఆవశ్యకతను గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, యాప్ ను ఏవిధంగా మొబైల్ ఫోన్ లలో డౌన్లోడ్ చేసుకొని ఇన్స్టాల్ చేసుకోవాలో వివరిస్తున్నారు. మహిళలకు విద్యార్థినులకు అత్యవసర సమయాలలో శక్తి యాప్ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. మొబైల్ ఫోన్ లో శక్తి యాప్ ఉంటే రక్షణగా పోలీసులు మీ వెంటే వున్నట్లేనన్నారు. అత్యవసర పరిస్థితులలో ఆపదలో చిక్కుకున్న మహిళలు, విద్యార్థినిలు యాప్ లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేసినా, హ్యాండ్ షేక్ అనే సదుపాయం వినియోగించుకొని మొబైల్ ఫోన్ ను గట్టిగ షేక్ చేసినా వెంటనే కంట్రోల్ రూమ్ కు సమాచారం అందుతుందన్నారు. తద్వారా నిమిషాల వ్యవధిలోనే పోలీసులు బాధితుల వద్దకు చేరుకొని వారికి భద్రత కల్పిస్తారన్నారు. యాప్ లోని సేఫ్ ట్రావెల్ అనే సదుపాయం ఉంటుందని తెలిపారు. మహిళలు విద్యార్థినులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఆటోలలో, క్యాబ్ లేదా ఇతర వాహనాల్లో ఒంటరిగా ప్రయాణించే సందర్భంలో సేఫ్ ట్రావెల్ సదుపాయాన్ని ఎంపిక చేసుకొని బయలుదేరే ప్రాంతం, చేరుకోవాల్సిన గమ్యస్థానం, ప్రయాణంచేసే వాహనం నెంబర్ తదితర వివరాలు అందులో నమోదు చేయాలన్నారు. వాహనం వెళ్లే మార్గం కంట్రోల్ రూమ్ నుండి పరివేక్షించబడుతుందన్నారు. వాహనం నిర్దేశిత మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్తుంటే కంట్రోల్ రూమ్ కు మెసేజ్ వెళుతుందన్నారు. వెంటనే స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి ఘటన స్థలానికి పంపడం జరుగుతుందన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధిత మహిళకు రక్షణ కల్పించి తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు. మహిళలు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ లకు వెళ్ళవలసిన అవసరం లేకుండా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. గివ్ ఏ కంప్లైంట్ అనే సదుపాయం వినియోగించుకొని చేసిన ఫిర్యాదును పరిశీలించి పోలీసులు మిమ్మల్ని సంప్రదిస్తారని తెలిపారు. మహిళలు ఏదైనా తెలియని ప్రదేశానికి లేదా కొత్త ప్రదేశానికి వెళ్ళినట్లయితే యాప్ వినియోగించుకొని అక్కడ దగ్గరలో ఉన్న లినైట్ షెల్టర్లు గురించిన సమాచారం తెలుసుకోవచ్చునన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ ల వివరాలు అక్కడి పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లు, అత్యవసర నెంబర్లు ఈ యాప్ లో పొందుపరచబడి ఉన్నాయన్నారు. జిల్లాలోని మహిళలు విద్యార్థినిలు తమ మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

# చీనీ రైతులకు మోసం చేస్తే కఠిన చర్యలు

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- మార్కెట్ యార్డులో మోసాలను బట్టబయలు చేసిన ఎమ్మెల్యే
- మార్కెట్ యార్డ్ సెక్రటరీపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం
- చీనీ మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- 5మంది వ్యాపారులు, 10శాతం కమీషన్ పై ఆగ్రహం





**అనంతపురం ఏప్రిల్ 9:** అనంతపురం జిల్లా అనంతపురం మార్కెట్ యార్డులో చీని రైతులకు రైతులకు మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు అండగా ఉండాలని అనంతపురం శాసనసభ్యులు దగ్గుబాటి ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. అనంతపురం మార్కెట్ యార్డులో చీనీ రైతులకు జరుగుతున్న మోసంపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఉగ్రరూపం దాల్చారు. ఇవాళ ఉదయం ఆయన మార్కెట్ యార్డును నడన్ విజిట్ చేశారు. ఇక్కడ గత కొన్ని రోజులుగా కేవలం ఐదు మంది వ్యాపారులు మాత్రమే ఆన్లైన్ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. బయట మార్కెట్లలో టన్ను చీనీ 50 వేలు ఉండగా ఇక్కడ 20 నుంచి 25 వేల మధ్య మాత్రమే వచ్చేలా చూస్తున్నారు. అందులో రైతుల మధ్య పోటీ పెడుతూ వారిని దగా చేస్తున్నారు. దీనిపై గత నెల రోజులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి తన సిబ్బందితో నిఘా ఉంచారు. పండ్లతోట రైతు సంఘాలు, సిపిఐ నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు. ఇవాళ ఆయన ఆకస్మికంగా మార్కెట్ యార్డ్ ని తనిఖీ చేసి.. అక్కడ మోసాలని బట్టబయలు చేశారు. విషయం తెలుసుకున్న సిపిఐ, రైతు సంఘం నాయకులు కూడా అక్కడికి చేరుకున్నారు. అక్కడున్న మార్కెట్ యార్డ్ సెక్రటరీ పై ఎమ్మెల్యే దగ్గుపాటి నిప్పులు చెరిగారు. ఇక్కడ ఎంతమంది వ్యాపారులు పంట కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించగా.. 42 మంది దాకా ఉన్నారని చెప్పారు. దీంతో గత నెల రోజుల నుంచి జరిగిన వ్యాపారం రికార్డులన్నీ బయటకి తీశారు. కేవలం ఐదు మంది మాత్రమే ఇక్కడ పంట కొనుగోలు చేస్తున్నారని.. మిగిలిన వారు ఏమయ్యారని నిలదీశారు. మరోవైపు రైతుల నుంచి నిబంధనల ప్రకారం 4శాతం కమీషన్ వసూలు చేయాల్సి ఉండగా 10% వరకు వసూలు చేస్తున్నారని రైతులు చెప్పారు. దీంతో ఆయన మార్కెట్ యాడ్ సెక్రటరీని నిలదీశారు. అయితే దీనిపై తనకు సమాచారం లేదని చెప్పగా ఎమ్మెల్యే దగ్గుపాటి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్ లో మీరు ఏమైనా గాడిదలు కాస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రభుత్వానికి కేవలం ఒక్క పర్సెంట్ మాత్రమే అందుతుందని..మిగిలినది మార్కెట్ యార్డ్ కే వస్తుందన్నారు. కానీ ఇక్కడ 4శాతం కూడా కొంతమంది దగ్గరే వసూలు చేసి.. మిగిలిన వారితో మీరు వసూళ్లు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తన వద్ద పక్కా సమాచారం ఉందన్నారు. రైతులు నుంచి ఫిర్యాదు తీసుకొని మార్కెట్ యార్డ్ సెక్రటరీ పై చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇకనుంచి మార్కెట్ యార్డులో ఈ ఆటలు సాగనివ్వనన్నారు. గత ఇదేళ్లుగా ఇలా రైతులను దోపిడీ చేసి కొందరు వ్యాపారులు..ఇక్కడ సిబ్బంది సొమ్ము చేసుకున్నారన్నారు. ఇక నుంచి రైతుల్ని మోసం చేస్తే సహించేది లేదని దగ్గుపాటి అన్నారు. రైతు సంఘం, సీపీఐ నాయకులు చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు జగదీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సిపిఐ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున, పండ్ల తోటల రైతు సంఘం నాయకులు అనంత రాముడు తదితరులు పాల్గొన్నారు.

## మైక్రోసాఫ్ట్ ఎఐ స్కిల్స్ పై 3 రోజుల కార్యశాల ప్రారంభం



**ఏప్రిల్ 9,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** బహుళ జాతీయ సంస్థల అవసరాలను తీర్చడానికి, విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు కల్పించదానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్ నైపుణ్యాలను పెంపొందించుటకు మైక్రోసాఫ్ట్ లాగిన్ యాక్సెస్ ద్వారా కార్యశాల నిర్వహించబడింది. ఎస్వీయూ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫిజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, గణిత శాస్త్రాల విద్యార్థులు తమ సంబంధిత కోర్సులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్‌ను మెరుగుపరచడానికి అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 09 నుండి 11 వరకు 3 రోజుల పాటు జరగే కార్యక్రమాన్నీ వర్సిటీ విసి ఆచార్య అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ నరసయ్య, ప్లేస్మెంట్ అధికారి ఆచార్య మురళి, ఆచార్య సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సత్తి దంపతులు



**తూర్పుగోదావరి జిల్లా ఏప్రియల్ 09:** అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన పడాల రామ తిరపారెడ్డి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను, ఇదే మండలంలో రామవరం గ్రామంలో కళ్యాణ మండపం ఎదురుగా కర్రి అబ్బాయి కుమారుడు కృష్ణారెడ్డి కోడలు శ్రీమతి కర్రి రుక్మిణి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను,బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామానికి చెందిన మేడపాటి శ్రీనివాసరెడ్డి భార్య శ్రీమతి చంద్రకళ, ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను, కొవ్వూరి సూర్యానారాయణ రెడ్డి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను, పరామర్శించిన అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త , మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు. వారితో పాటు కర్రి గాంధీ రెడ్డి , నల్లమిల్లి ఆదినారాయణ రెడ్డి(బాపూజీ),పడాల అమ్మిరెడ్డి, పడాల వీర్రాఘవ రెడ్డి, సత్తి సాయిశివారెడ్డి, పడాల చంటి రెడ్డి , పడాల బ్రహ్మారెడ్డి, పడాల అమ్మిరెడ్డి, గొలుగూరి వెంకటరెడ్డి, గొలుగూరి రామారెడ్డి,రాము (బలభద్రపురం గ్రామ శాఖ అధ్యక్షులు), నల్లమిల్లి వెంకట రెడ్డి(వడ్డీలు వెంకటరెడ్డి) (బలభద్రపురం గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు) , మేడపాటి ఆనంద్ రెడ్డి (ఎంపీటీసీ 2 సభ్యులు) , తేతల శ్రీనివాసరెడ్డి , కోనాల రామకృష్ణారెడ్డి (మూడవ వార్డు సభ్యులు) తదితరులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైయస్ఆర్‌సీపీ) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్.వి.ఆర్. ఫంక్షన్ హాల్ ఓపినింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

**తూర్పుగోదావరి జిల్లా ఏప్రియల్ 09:** పొలమూరులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సత్తి వెంకటరెడ్డి పద్మావతి ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా సందర్శించి, శుభాకాంక్షలు తెలిపిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఈ కార్యక్రమంలో పొలమూరు, రామవరం గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## బలభద్రపురంలోసీసీ రోడ్లు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి.

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 09:** బిక్కవోలు మండలం బలభద్రపురంలో 37.37 లక్షల రూపాయలతో 5 సీసీ రోడ్లను ప్రారంభోత్సవం చేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ,బిక్కవోలు మండల, బలభద్రపురం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలకు హాజరైన కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కామన

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏప్రియల్ 09:** గుజరాత్ రాష్ట్రం లోని అహ్మదాబాద్ నగరం లో జరుగుతున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలకు ఏఐసీసీ సభ్యులు, కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కామన ప్రభాకరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల, మాజీ కేంద్ర మంత్రి సచిన్ పైలెట్, అశోక్ గెహ్లాట్, దిగ్విజయ్ సింగ్, సుశీల్ కుమార్ షిండే తదితర ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాలతో సత్కరించారు.

## జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధుసూధనరెడ్డి జన్మదినం సందర్బంగా

అనాధ ఆశ్రమం లో అన్నదానం!

**ధర్మవరం ఏప్రిల్ 9:** ధర్మవరం నియోజకవర్గం జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధు సూధన రెడ్డి జన్మదిన వేడుకలు శుభ సందర్భంగా బుధవారం ధర్మవరం మండలం గొట్లూరు అనాధ ఆశ్రమం లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో అఖిల్ రాయల్, సురేష్, భాస్కర్, నాగలూరు శీనా, గొట్లూరు సాకె వీరు, చంద్ర బండ్ల చంద్ర శేఖర్, విష్ణు, ప్రశాంత్, ఇమ్రాన్, గుద్దిటి చిరంజీవి, పేరూరు శీనా, సాయినాథ్,తదితరులు పాల్గొన్నారు.పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు.

# రాప్తాడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం





- అభివృద్దే టీడీపీ, పరిటాల అజెండా.. పరిటాల సునీతలి
- పనికిమాలిన వారి మాటలు ఎవరూ పట్టించుకోవద్దు
- నియోజకవర్గంలో 5కోట్లతో సబ్ స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ

**అనంతపురం ఏప్రిల్ 9:** రాప్తాడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం పని చేస్తున్నదని ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా ఉండాలని రాప్తాడు శాసన సభ్యురాలు పరిటాల సునీత అన్నారు తెలుగుదేశం, పరిటాల కుటుంబం అజెండా అభివృద్ధి మాత్రమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలో 5కోట్లతో రెండు చోట్ల విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఆమె భూమి పూజలు చేశారు. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామంలో రూ.2.50కోట్ల నిధులతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అధికారులు, నాయకులతో కలసి భూమి పూజ చేశారు. ఆ తర్వాత రాప్తాడు మండలం హార్మోనీ సిటీ సమీపంలో 2.50కోట్ల నిధులతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టడంపై ఎమ్మెల్యే సునీతకు స్థానికులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గతంలో విద్యుత్ సమస్యలు పెద్ద ఎత్తున తన దృష్టికి వచ్చాయన్నారు. లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెప్పారన్నారు. ఎన్నికల ముందే చాలా చోట్ల సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.. ఆ రోజు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వందల్లో ట్రాన్స్ఫర్మర్లు ఇచ్చామని.. కానీ కండక్టర్, ఇతర మెటీరియల్ తగినంత ఇవ్వలేదన్నారు. దీని వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు జిల్లాలో విద్యుత్ శాఖ ఎస్ఈలు దీనిపై స్పందించి.. రైతులకు సామగ్రి ఇవ్వాలన్నారు. ఇంకా అవసరమైన సబ్ స్టేషన్లను గుర్తించామని... త్వరలో వాటిని కూడా మంజూరు చేయించి నిర్మాణాలు చేపడుతామన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడైనా రైతుల సమస్యలు పట్టించుకున్నారా అని ఆమె నిలదీశారు. మా దృష్టి ప్రజా సమస్యల పరిష్కారంపైన, అభివృద్ధిపై మాత్రమే ఉందన్నారు. పనికిమాలిన వారు మాట్లాడే మాటలను పట్టించుకునే తీరక, అవసరం రెండూ మాకు లేవని స్పష్టం చేశారు. ప్రజలు మాపై నమ్మకంతో గెలిపించారని.. మేము వారికి జవాబుదారీతనంగా ఉంటామని ఎమ్మెల్యే సునీత తెలిపారు....

# ప్రజా సమస్యలు పరిష్కరించండి

- ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించిన మంత్రివర్యుల ఎన్ఎండి ఫరూక్ , అబ్జర్వర్ పోతురాజు రవికుమార్

**నంద్యాల ఏప్రిల్ 9:** నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) ఆవరణం నందు ప్రజా సమస్యల పరిష్కారానికై " ప్రజా దర్బార్ " కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , టిడిపి నంద్యాల అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ , పోతురాజు రవికుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక అంశాలపై అర్జీలను ప్రజల నుంచి స్వయంగా స్వీకరించారని. ప్రతి ఒక్కరి సమస్యలను సావధానంగా విని వెంటనే అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు .. ప్రతి బుధవారం ఒక మండల కేంద్రంలో జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆయా మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలిని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని, వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు..

**టిడిపి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమైన అబ్జర్వర్ పోతురాజు రవికుమార్**

నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు టిడిపి ముఖ్య నాయకులతో , వార్డు ఇన్చార్జిలతో నంద్యాల టీడీపీ అబ్జర్వర్ పోతురాజు రాజకుమార్ సమావేశమయ్యారు . ఈ సందర్భంగా నంద్యాల టిడిపి అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేఎస్ఎస్ (కుటుంబ సాధికార సారధులు) తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరూ కేఎస్ఎస్ సభ్యులుగానే ఉండాలన్నారు. క్లస్టర్.. యూనిట్..





బూత్ (క్యాబ్) కమిటీల్లో ఏదో ఒక ధానికి కన్వీనర్ గా ఉండాలని తెలిపారు . ఉదాహరణకు "నేను నా నియోజకవర్గంలో ఒక కేఎస్ఎస్ సభ్యుడిగా ఉండి పార్టీకి మెజార్టీ సాధిస్తేనే ఎన్నికల్లో పోటీకి అర్హుడను తెలిపారు .


## ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే సత్తి

**తూర్పుగోదావరి జిల్లా రిపోర్టర్ ఏప్రియల్ 09:** అనపర్తి మండలం రామవరం గ్రామంలో సత్తి వెంకటరెడ్డి, పద్మావతి ఎస్.వి.ఆర్ పేరుతో నూతన ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ నూతన ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త , మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మరియు శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు,సూర్రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పయ్యావుల కేశవ్





**- : నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని, బిపిహెచ్ ను, సిసిరోడ్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తో కలిసి ప్రారంభించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్..**

**అనంతపురం, ఏప్రిల్ 09 :** ఉరవకొండ నియోజకవర్గంలోని బెలుగుప్ప మండల కేంద్రంలో రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తో కలిసి బెలుగుప్పలోని గుండ్లపల్లి రోడ్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు 1.75 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం అక్కడే 50 లక్షల రూపాయలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బిపిహెచ్) ను మంత్రి ప్రారంభించడం జరిగింది. తదనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో మంత్రి, జిల్లా కలెక్టర్ మొక్కలు నాటి నీరు పోశారు. నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఎస్.సి కాలనీలో సిసిరోడ్డును ప్రారంభించిన మంత్రి, డాక్టర్ వి వినోద్ కుమార్ జిల్లా కలెక్టర్ - ఆ తర్వాత బెలుగుప్ప మండల కేంద్రంలోని ఎస్.సి కాలనీలో 16.71 లక్షల రూపాయలతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సిసి రోడ్డును మంత్రి, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.సి కాలనీ మహిళలు పూలు చెల్లుతూ మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆవులన్న గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు, నాయకులు థాంక్యూ మినిస్టర్ సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అంతకుముందు బెలుగుప్ప మండల కేంద్రానికి చేరుకున్న మంత్రికి భారీ గజమాలతో ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు.



- ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, ఆర్%డ%బి ఎస్ఈ రాజగోపాల్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆర్%డ%బి డిఈ బాల కాటమయ్య, మెడికల్ అధికారులు డా.కార్తీక్ కుమార్ రెడ్డి, డా.ప్రియాంక, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

స్మశానవాటికని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు చేపట్టాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు శ్రీ సత్య కుమార్ యాదవ్

**ధర్మవరం, ఏప్రిల్ 9:** శ్రీ సత్య సాయి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గలమైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా ధర్మవరం నియోజకవర్గం నందు చెరువుల అభివృద్ధి చేయడానికి ఎంత మేరకు నిధులు అవసరమో నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ధర్మవరం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుండి మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచే దిశగా ప్రతి శాఖ కూడా సక్రమంగావ్యవహరించాలని సూచించారు ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమన్వయంతో పనిచేస్తే అన్ని కార్యక్రమాలూ విజయవంతంగా అమల - వుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన రిజర్వాయర్ ప్రాజెక్టును సుమారు 60 లక్షల రూపాయలతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 85 చెరువులలో అభివృద్ధి చేయడానికి 96 పనులు ఆమోదించి ప్రభుత్వానికి 179.9 లక్షల రూపాయలు నిధులు అవసరమని నివేదికలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్రిబుల్ ఆర్ ద్వారా 21 చెరువుల అభివృద్ధి చేయడానికి 795 లక్షల రూపాయలు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి నివేదికల సమర్పించడం జరిగిందని తెలిపారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలువ ద్వారా, పీఏబీఆర్ ద్వారా కాలువల ద్వారా 14 చెరువులు నీరు అందజేయుచున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ అధికారి విశ్వనాథరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప, హౌసింగ్ అధికారి శంకరయ్య, ఎస్ సి పి ఆర్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు



## పేదలపై గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో అదనపు భారం తగదు-ఎమ్మెల్సీ తోట



**కోనసీమ జిల్లా ఏప్రియల్ 09:** పేదలపై గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో అదనపు భారం తగదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలపై రూ. 50, పెట్రోల్ , డీజిల్ ధర పై రూ. 2 పెంచిన నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ పెంపు పేద మధ్యతరగతి ప్రజలపై అధిక భారం మోపుతుందని పేర్కొన్నారు. సంపద సృష్టి పేరుతో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సరైనవి కావని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన లెక్కలతో కూడిన వివరణ ఇచ్చారు.తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయన్నారు. గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ. 50 పెరిగి, సగటున ఒక సిలిండర్ ధర రూ. 900 నుంచి రూ. 950కి చేరిందన్నారు. ఒక సాధారణ కుటుంబం నెలకు ఒక సిలిండర్ వినియోగిస్తే, సంవత్సరానికి రూ. 600 అదనపు ఖర్చు అవుతుందన్నారు. అదే విధంగా, పెట్రోల్ ధర లీటరుకు రూ. 2 పెరిగి, సగటున రూ. 105 నుంచి రూ. 107కి చేరిందని విమర్శించారు. ఒక వ్యక్తి నెలకు 50 లీటర్ల పెట్రోల్ వాడితే, అదనంగా రూ. 100, సంవత్సరానికి రూ. 1,200 భారం పడుతుందని అవేదన వ్యక్తం చేశారు. ఈ రెండింటినీ కలిపితే, ఒక కుటుంబానికి సంవత్సరానికి రూ. 1,800 అధిక ఖర్చు అవుతోందని వివరించారు. ప్రభుత్వం సంపద సృష్టిస్తామని చెబుతోంది, కానీ ఈ విధంగా పేదలపై భారం మోపడం ద్వారా సంపద సృష్టించడం న్యాయం కాదని వ్యాఖ్యానించారు. ఒక సామాన్య కుటుంబం నెలసరి ఆదాయం రూ. 15,000 అనుకుంటే, ఈ పెరిగిన ధరల వల్ల వారి ఆదాయంలో 1% కంటే ఎక్కువ ఖర్చు అవుతోందన్నారు. ఇది వారి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో, కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. వారిని ఇబ్బంది పెట్టడం కోసం కాదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

## పంచాయతీ విస్తరణ అధికారులు ఇక డిప్యూటీ ఎంపీడీవోలు

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో పంచాయతీ రాజ్ శాఖలో మార్పులు

**అమరావతి, ఏప్రిల్ 9):** ఎన్నో ఏళ్లుగా పంచాయితీ రాజ్ వ్యవస్థలో పనిచేస్తున్న పదోన్నతలకు నోచుకోని ఉద్యోగులకు ఎట్టికేలకు బధవారం జీవో నంబర్ 35ను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈజీఓలో ఇంతవరకు ఎంపిడిఓ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ విస్తరణ అధికారులు క్యాడర్ డిప్యూటీ ఎంపీడీవోలుగా మార్పు చేస్తూ జీ ఓ విడుదల చేశారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా పదోన్నతులకు నోచుకోని వేలాది మంది ఉద్యోగులకు ఉపశమనం లభించింది. రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగుల సంఘం నేతలు, ఉద్యోగులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఇంతవరకు ఎంపిడిఓ పోస్టులు భర్తీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా చేపట్టేవారని.. దీన్ని నూతన జీఓ ప్రకారం రద్దు చేశారని స్పష్టం చేశారు. ఇక నుండి ఎంపిడిఓలు పదోన్నతుల ద్వారా మాత్రమే వస్తారని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్న నూతన జీఓ 35 ను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు జీ ఓ విడుదల చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి చారిత్రిక నిర్ణయానికి కారకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశి భూషణ్ కుమార్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ కృష్ణ తేజ, పవన్ కళ్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణ లకు పంచాయతీ సంఘ నేతలు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## నవజాత శిశువులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్



**విజయవాడ, ఏప్రిల్ 9) :**నవజాత శిశువుల అనారోగ్య పరిస్థితులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించింది. బుధవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు,సభ్యులు గొండు సీతారాం,కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణ, జంగం రాజేంద్ర ప్రసాద్ లు సందర్శించారు. ఆసుపత్రిలో గత 3 ఏళ్ళు నుండి నేటి వరకు నమోదైన నవజాత శిశువులు వివరాలు, వారు పొందిన వైద్య విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు,నవ జాత శిశువుల తల్లిదండ్రులతో మాట్లాడారు,అనంతరం కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన ఆసుపత్రుల్లోని నవ జాత శిశువుల విభాగాలను సందర్శించి వాటిల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్టు చెప్పారు,బాలల హక్కుల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్న తమ కమిషన్ ఆసుపత్రుల్లో వివిధ చర్యలకు ప్రణాళికతో కమిషన్ అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ. యు.శోభ, వైద్యులు సునీత, అశ్విని, ఖ్యాతి, సౌజన్య, శేష బాబు, ఇంచార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ విజేత కాకినాడ జిల్లా జట్టు





**ధర్మవరం ఏప్రిల్ 9:** హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ధర్మవరంలో జరుగుతున్న 15వ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ పోటీలలో విజేతగా కాకినాడ జిల్లా జట్టు నిలిచింది సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్లో కాకినాడ జిల్లా జట్టు కడప జిల్లా జట్టును 2-0 గోల్స్ తేడాతో విజయం సాధించి కప్పును కైవసం చేసుకుంది ఉదయం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ లలో కాకినాడ జిల్లా జట్టు తిరుపతి జిల్లా జట్టుపై 1-0 గోల్స్ తో, కడప జిల్లా జట్టు అన్నమయ్య జిల్లా జట్టుపై 5-4 గోల్స్ తేడాతో విజయం సాధించాయి. విజేతలకు వైద్య,ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ గారు ప్రథమ స్థానం సాధించిన జట్టుకు బహుమతులు ప్రధానం చేశారు , రెండవ స్థానం సాధించిన కడప జిల్లా జట్టుకు ధర్మవరం షిరిడి సాయిబాబా సేవా సమితి అధ్యక్షులు వీరనారాయణ గారు, మూడవ స్థానం సాధించిన అన్నమయ్య జిల్లా జట్టుకు, జయ శ్రీ గారు,బహుమతులు అందజేశారు. త్వరలో ధర్మవరంలో జాతీయ స్థాయి టోర్నమెంట్ నిర్వహించే విధంగా నా తోడ్పాటు ఉంటుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు

ఈరోజు కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ ట్రెజరర్ థామస్ పీటర్,సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్, సత్య సాయి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌరీ ప్రసాద్, ఉడుములరామచంద్ర, ఊకా రాఘవేంద్ర,మహమ్మద్ అస్లాం, ట్రెజరర్ అంజన్న,సత్య సాయి జిల్లా జాయింట్ సెక్రెటరి అరవింద్ గౌడ్, జెన్నే చందు, డైరెక్టర్లు మారుతి ప్రసాద్, ఇర్షాద్, అమునుద్దీన్,కిరణ్, వివిధ జిల్లాల హాకీఅధ్యక్షులు,కార్యదర్శులు సత్య సాయి జిల్లా హాకీ కోచ్ హసేన్ తదితరులు పాల్గొన్నారు

## వైఎస్ఆర్సిపి కన్వీనర్ రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు

**ఉమ్మడి తూర్పుగోదావరి ఏప్రియల్ 09:** అనపర్తి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ



కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) నానమ్మ శ్రీమతి సత్తి సూరయ్యమ్మ(90) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అనపర్తి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, అనపర్తి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ రంగంపేట మండల ఇంచార్జ్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కన్వీనర్ విజయ కుమారి, వైకాపా నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నల్లమిల్లి వేణురెడ్డి విజయ్, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొవ్వూరు శ్రీనివాసరెడ్డి (గుంటూరు శ్రీను), అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత సబ్బెళ్ళ అమ్మిరెడ్డి, సంపర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అద్దంకి ముక్తేశ్వరరావు, వేంద్ర సర్పంచ్ వాసు తదితరులు రాంబాబు కుటుంబాన్ని పరామర్శించి సూరయ్యమ్మ మృతికి సంతాపం తెలిపి ఆమె చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులు అర్పించారు. వీరితోపాటు అనపర్తి వీరుళ్ళమ్మవారి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు వెంకట రామారెడ్డి, అయ్యప్ప దేవస్థానం నిర్వహణ కమిటీ అధ్యక్షులు సబ్బెళ్ళ సత్యనారాయణరెడ్డి, శివాలయం కమిటీ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, పోతంశెట్టి కృష్ణారెడ్డి, అనపర్తి గ్రామ సర్పంచ్ వార కుమారి, ఎంపిటిసిలు కొండేటి భీమేష్, బండారు శ్రీనివాసరావు, పి.వి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (కేపిఆర్), తేతల బులిరెడ్డి, పడాల కళ్యాణ్ రెడ్డి, శంకర్ బాబు, ఎన్సీఆర్ అండ్ కో ప్రతినిధులు నల్లమిల్లి భాస్కరరెడ్డి, నల్లమిల్లి బాబుల్ రెడ్డి, నల్లమిల్లి వెంకట మునీశ్వరరెడ్డి, అనపర్తి వర్తక సంఘం మాజీ అధ్యక్షులు సత్తి విశ్వనాథరెడ్డి, విశ్వరామ్ బ్రదర్స్ శ్రీను, రాము, తమలంపూడి అమ్మిరెడ్డి (బియ్యంకొట్టు), అనపర్తి పంచాయతీ పాలకవర్గ సభ్యులు వాసంశెట్టి కోటేశ్వరరావు,తేతలి కళావతి వెంకటరెడ్డి, తేతల రామకృష్ణారెడ్డి (ఏసిడ్ రామ్), తిరగటి శివ, కానూరి కృష్ణారావు, మల్లిడి గోపీకృష్ణారెడ్డి (గోపి),మదర్ తెరిసా సేవా సమితి వ్యవస్థాపకులు ఉందుర్తి సుబ్బారావు, కర్రి మణికంఠ సత్యనారాయణరెడ్డి (సత్య), నల్లమిల్లి ధర్మారెడ్డి తదితరులతో పాటు పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

**కాకినాడ జిల్లా ఏప్రియల్ 09:** వేంద్రలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వార్లను దర్శించుకున్న అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పెదపూడి మండల, వేంద్ర గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు.



# బిజినెస్

## హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాదారులకు అలర్ట్..
## 12న బ్యాంకు సేవలలో అంతరాయం!



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్! 12వ తేదీన బ్యాంకు సేవలలో కొంత అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. అందుకే వినియోగదారులు ముందుస్తుగా గమనించడం చాలా ముఖ్యం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ప్లాట్‌ఫారమ్‌ల నిర్వహణలో భాగంగా, కొన్ని బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం ఏర్పడవచ్చు. ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 2.30 గంటల నుంచి ఉదయం 6.30 గంటల వరకు (4 గంటలు) పలు సేవల్లో అంతరాయం ఏర్పడనుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తెలిపింది. ఈ బ్యాంకు సిస్టమ్ నిర్వహణలో భాగంగా ఏర్పడే అంతరాయాల్లో చాట్‌బ్యాంకింగ్, ఎస్ఎంఎస్ బ్యాంకింగ్, ఫోన్‌బ్యాంకింగ్ ఐవీఆర్ సేవల్లో అంతరాయం ఉండవచ్చు. బ్యాంక్ తన కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను కొత్త ప్లాట్‌ఫామ్‌కు అప్‌గ్రేడ్ చేస్తోంది. దాని 93 మిలియన్ల వినియోగదారులకు కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడం ధ్యేయంగా పెట్టుకుంది. దీంతో బ్యాంకు వినియోగదారులను మెయిల్స్, సందేశాన్ని కూడా పంపినట్లు తెలిపింది. సిస్టమ్ అప్‌గ్రేడ్ చేస్తున్నందున బ్యాంకు అకౌంట్‌కు సంబంధించి యూపీఐ సేవలతో పాటు ఇతర సేవలు అందుబాటులో ఉండవని తెలిపింది.

## ముడి చమురు తగ్గింపు
## లాభాన్ని కాజేస్తున్న కేంద్రం



అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అమాంతం పడిపోయాయి. గతేడాది 2024 నుంచి తగ్గుముఖం పట్టిన చమురు ధరలు ఇటీవల మరింత దిగివచ్చాయి. 2025 ప్రారంభంలో బ్యారెల్ 70 డాలర్ల దిగువకు పడిపోయింది. తాజాగా వాణిజ్య యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో సోమవారం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర 64 డాలర్లకు క్షీణించింది. అటు టెక్సాస్ క్రూడ్ ధర 60 డాలర్లకు దిగొచ్చింది. ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి కావడం విశేషం. వాణిజ్య యుద్ధం ఇతర పరిణామాలతో రష్యా ఉరల్స్ ఆయిల్ ధర ఏకంగా 50 డాలర్లకు క్షీణించింది. అయితే ఈ తగ్గింపు కారణంగా రిటైల్ మార్కెట్‌లో పెట్రోలు, డీజిలు ధరలు తగ్గుతాయని ఆశించిన వినియోగదారులను కేంద్ర ప్రభుత్వం నిలువునా వంచనకు గురిచేస్తోంది. ఎక్సైజ్ డ్యూటీలు అదనంగా పెంచేసి తగ్గింపు లాభాలు ప్రజలకు చేరనీయకుండా దొడ్డిదారిన దోచుకుంటోందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రజలపై ఎప్పటిలానే ధరాభారం పెరిగిపోతోంది. డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధం ఒత్తిడి, అమెరికాలో పెరుగుతున్న మాంద్యం భయాలు, ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం ఇవన్నీ చమురు ధరలు పడిపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒపెక్ దేశాలు ఉత్పత్తి అంచనాలకు కోత పెట్టాయి. ఇది బలహీనమైన ప్రపంచ వినియోగాన్ని ప్రతిబింబిస్తుంది. మరోవైపు చైనా వంటి మార్కెట్లలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగడం క్రూడ్ ధరలు మరింత తగ్గేలా చేశాయి. వారంలో రెండుసార్లు చమురు ధరల అంచనాలను తగ్గించిన బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ మంగళవారం మరింత కోత పెట్టింది. బ్యారెల్ ధర 40 డాలర్లకు పడిపోయినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని విశ్లేషించింది.

## ఆర్బీఐ ఎంపీసీ సమావేశంలో కీలక నిర్ణయం..
# కోట్లాది మందికి ఉపశమనం!



దేశ బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ దేశంలోని కోట్లాది మందికి రుణ ఈఎంఐలలో ఉపశమనం కల్పించింది. ఆర్బీఐ వరుసగా రెండవసారి రెపో రేటును 0.25 శాతం తగ్గించింది. ఆ తర్వాత రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఇబ్బంది పడుతున్న సమయంలో ఆర్‌బిఐ నుండి ఈ నిర్ణయం వచ్చింది. దీని తర్వాత ప్రపంచంలో ద్రవ్యోల్బణం, మాంద్యం పెరిగే అవకాశం పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఆర్‌బిఐ తీసుకున్న ఈ నిర్ణయం చాలా మెరుగైనదిగా ఉంది. ఆర్బీఐ ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు 0.25 శాతం కోతను సిఫార్సు చేశారు. ఆ తర్వాత రెపో రేటును ఇంత తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేకత ఏమిటంటే ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వరుసగా రెండోసారి ఆర్‌బిఐ పాలసీ రేటును తగ్గించారు. ఫిబ్రవరి నెలలో జరిగిన పాలసీ సమావేశంలో కూడా వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించారు. ఈ తగ్గింపు దాదాపు 5 సంవత్సరాల తర్వాత అంటే 56 నెలల తర్వాత కనిపించింది. ఈ తగ్గింపు తర్వాత సామాన్య ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని భావిస్తున్నారు. బ్యాంకింగ్ రంగంలో గృహ రుణాలు, కారు రుణాలు, రిటైల్ రుణాల ఖర్చు తగ్గుతుంది. దీని నుండి రియల్ రంగం ఎంతో ప్రయోజనం పొందుతారు. గత కొన్ని నెలలుగా మాంద్యం ఎదుర్కొంటున్న ఈ రంగంలో ఇళ్లకు డిమాండ్ పెరగవచ్చు. మార్చి నెల ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడి కానప్పటికీ, ఫిబ్రవరి నెలలో దేశ ద్రవ్యోల్బణం 4 శాతం కంటే తక్కువగా ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 3.6 శాతంగా ఉంది. ఇది 7 నెలల్లో కనిష్ట స్థాయికి చేరుకుంది. దీనికి ప్రధాన కారణం ఆహార ద్రవ్యోల్బణం తగ్గడమేనని చెబుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఏప్రిల్ నెలలో కూడా రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం కంటే తక్కువగా ఉండవచ్చు. రాబోయే రోజుల్లో ఈ సమస్య తప్పదు. దానికి ఒక కారణం ఉంది. ఈసారి వేడి మరింత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనివల్ల పంటలపై ప్రభావం చూపుతుంది. దీని కారణంగా కూరగాయలు, ధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉంది. దీని ప్రభావం ఆహార ద్రవ్యోల్బణంపై కనిపిస్తుంది. రెండవది ట్రంప్ సుంకం కారణంగా రూపాయి తగ్గవచ్చు. అలాగే ద్రవ్యోల్బణం కారణంగా దిగుమతి ద్రవ్యోల్బణం పెరగవచ్చు. ఆర్‌బిఐ అంచనా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉంటుందని అంచనా. అయితే నాల్గవ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 10 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఇది మునుపటి 4.4 శాతం నుండి 4.5 శాతానికి పెరిగింది. అదే సమయంలో 2026 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.2 శాతంగా అంచనా వేయబడింది. అయితే మొదటి త్రైమాసికంలో ఇది 4.6 శాతం వద్ద ఉండవచ్చు. గతంలో ఇది 4.5 శాతంగా ఉంటుందని అంచనా. రెండవ త్రైమాసికంలో ఇది 4 శాతం, మూడవ త్రైమాసికంలో 3.8 శాతం, నాల్గవ త్రైమాసికంలో 4.2 శాతంగా ఉంటుందని అంచనా.


# భారతదేశంలో క్రిప్టో నిబంధనలు..



ఆధునిక ఆర్థికవిధానంలో ఉన్న చిక్కుల్లో.. ఒకప్పుడు సముద్ర వాణిజ్యం ఉన్నట్లు ఇప్పుడు క్రిప్టో ఆస్తులు ఉన్నాయి. ఇందులో అవకాశం, ప్రమాదం రెండూ ఉంటాయి. ప్రతి విషయంలో అభివృద్ధి ఉన్నట్లే మన దేశంలోని క్రిప్టో రెగ్యులేటరీ విధానం ప్రస్తుతం అన్వేషణ దశలో ఉంది. 2025 వచ్చేసింది. ఈ విధానం దేశ నాయకులతో పాటు.. ఇందులో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలనే ప్రతి మదుపుదారు, వ్యాపారి దృష్టిసారించాలని భావిస్తున్నారు. క్రిప్టోపై భారత్ వైఖరి నిర్మాణాత్మక వివేకంతో కూడుకున్నది. అవసరమైనప్పుడు వ్యవహరించే ధోరణితో 'వేచి చూసే' విధానాన్ని ఈ దేశం అవలంబిస్తోంది. అయితే క్రిప్టో, వర్చువల్ డిజిటల్ ఆస్తులను (వీడీఏ) ప్రస్తుత ట్యాక్స్ అండ్ కాంప్లయన్స్ ఫ్యాబ్రిక్‌లో కొంత మేరకు కేంద్రం పొందుపరిచిందని, ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని రూపొందిస్తోంది. దీనిపై అవగాహన కలిగేందుకు దోహదపడుతుందని జియోటస్ క్రిప్టో ప్లాట్‌ఫామ్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ అన్నారు. వీడీఏల నుంచి వచ్చే లాభాలపై భారత్ 30 శాతం పన్ను విధిస్తోంది. దీనికి హోల్డింగ్ పీరియడ్ లేదా ట్రేడింగ్ స్కేల్ తో సంబంధం లేదు. నష్టాలను పూడ్చుకోవడానికి ఈ పన్ను విధానంలో వీలుండదు. ఇది మార్కెట్ లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ రిస్క్ మేనేజ్ మెంట్ ను ఒక ముఖ్యమైన నైపుణ్యంగా చేస్తుంది. లావాదేవీలపై మూలం వద్ద 1% పన్ను మినహాయింపు (టీడీఎస్) వర్తిస్తుంది. దీన్ని సులభంగా గుర్తించాలి. ఇతరత్రా వ్యాపారాల తరహాలో దాచిపెట్టలేరు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను క్రిస్టలైజ్ చేయడం అనేది ఓ కొత్త విషయం. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ)లో రిజిస్టర్ అయిన ఎక్స్ఛేంజీలు నో యువర్ కస్టమర్ (కేవైసీ), యాంటీ మనీ లాండరింగ్ (ఏఎంఎల్) ప్రోటోకాల్స్ లాంటివాటిని సంప్రదాయ ఆర్థిక సంస్థల్లాగే కఠినంగా పాటించాలి. ఇది పెట్టుబడిదారులకు మరింత రక్షణ, సంస్థాగత చట్టబద్ధతకు వేదికను కల్పిస్తుంది. క్రిప్టో ఊహాజనిత కొత్తదనం స్థాయి నుంచి విశ్వసనీయ ఆస్తి వరకు అభివృద్ధి చెందడానికి ఇది అవసరం. నిబంధనలను సాధారణంగా ఒంటరిగా రూపొందించరు. భారతదేశ విధాన దిశ అంతర్జాతీయ చర్చకు అద్దం పడుతోంది.

## ఐపీఎల్ హిస్టరీలో ఫాస్టెస్ట్ సెంచరీ ఇదే..
# టాప్ 5లో ప్రీతి జింటా ప్లేయర్





అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి మాట్లాడితే, ఐపీఎల్ చరిత్రలో చాలానే ఫాస్టెస్ట్ సెంచరీలు నమోదయ్యాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన పేరు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ దే కావడం విశేషం. గేల్ కేవలం 30 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. గేల్ తర్వాత ట్రావిస్ హెడ్, విల్ జాక్స్ వంటి ప్లేయర్లు కూడా ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటే బ్యాటర్ల ఆధిపత్యం చెలాయించే టీ20 క్రికెట్ అనేది తెలిసిందే. ప్రతి సంవత్సరం అనేక రికార్డులు నమోదవుతుంటాయి. కొన్ని బద్దలవుతుంటాయి. ఈ క్రమంలో అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి మాట్లాడితే, ఐపీఎల్ చరిత్రలో చాలానే ఫాస్టెస్ట్ సెంచరీలు నమోదయ్యాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన పేరు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ దే కావడం విశేషం. గేల్ కేవలం 30 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. గేల్ తర్వాత ట్రావిస్ హెడ్, విల్ జాక్స్ వంటి ప్లేయర్లు కూడా ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. 2013లో పూణే వారియర్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడిన సమయంలో క్రిస్ గేల్ 30 బంతుల్లో సెంచరీ చేసిన సెంచరీ ఇప్పటికీ ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీగా నిలిచింది. ఈ ఇన్నింగ్స్ అత్యంత వేగవంతమైనది మాత్రమే కాదు, టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచింది. ఆ మ్యాచ్‌లో గేల్ 175 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇది కూడా ఓ రికార్డు. గేల్ తర్వాత, యూసుఫ్ పఠాన్ పేరు నిలిచింది. పఠాన్ 2010లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్నప్పుడు ముంబై ఇండియన్స్‌పై 37 బంతుల్లో సెంచరీ చేశాడు. పఠాన్ చేసిన ఈ సెంచరీ భారత బ్యాట్స్‌మన్ చేసిన వేగవంతమైన సెంచరీలో మొదటి కావడం విశేషం. తాజాగా పంజాబ్ కింగ్స్ ప్లేయర్ ప్రియాంష్ ఆర్య చెన్నై సూపర్ కింగ్స్‌పై కేవలం 39 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన రెండవ భారతీయుడిగా ప్రియాంష్ రికార్డులకెక్కాడు.

## మాక్స్‌వెల్‌కు షాకిచ్చిన బీసీసీఐ..
## 25 శాతం ఫైన్!



ఐపీఎల్ 2025లో భాగంగా మంగళవారం పంజాబ్ కింగ్స్- చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌ను పంజాబ్ కింగ్స్ 18 పరుగుల తేడాతో గెలుచుకుంది. 2 పాయింట్లు సాధించి ప్లేఆఫ్‌లకు తమ ఆశలను బలపరిచింది. అయితే మ్యాచ్ తర్వాత పంజాబ్ స్టార్ ఆటగాడు గ్లెన్ మాక్స్‌వెల్‌పై జరిమానా విధించబడింది. బీసీసీఐ అతనిపై కఠిన చర్యలు తీసుకుంది. ఐపీఎల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గ్లెన్ మాక్స్‌వెల్‌పై అతని మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించబడింది. ఈ నిర్ణయం బీసీసీఐ తీసుకుంది. అంతేకాకుండా నియమాలను ఉల్లంఘించినందుకు మాక్స్‌వెల్‌కు ఒక డిమెరిట్ పాయింట్ కూడా లభించింది. ఐపీఎల్ మీడియా విడుదలలో తెలిపిన వివరాల ప్రకారం.. గ్లెన్ మాక్స్‌వెల్ ఆర్టికల్ 2.2 (మ్యాచ్ సమయంలో ఫిక్స్చర్‌లు, ఫిట్టింగ్‌ల దుర్వినియోగం) కింద లెవెల్ 1 నేరాన్ని అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ శిక్షను కూడా అంగీకరించాడు. నిబంధనల ప్రకారం.. లెవెల్ 1 ఉల్లంఘనల కోసం మ్యాచ్ రిఫరీ నిర్ణయం తీసుకుంటారు. గ్లెన్ మాక్స్‌వెల్ ఐపీఎల్ 2025లో ఇప్పటివరకు పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. పంజాబ్ అతన్ని ఎన్నో ఆశలతో తమ జట్టులో చేర్చుకుంది. కానీ ఈ ఆస్ట్రేలియన్ స్టార్ ఆ ఆశలను నెరవేర్చలేకపోయాడు. ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌లలో అతను విఫలమయ్యాడు. 4 మ్యాచ్‌లలో 3 ఇన్నింగ్స్‌లలో అతను 31 పరుగులు మాత్రమే చేశాడు. అంతేకాకుండా 4 మ్యాచ్‌లలో అతను 3 వికెట్లు తీశాడు. రాబోయే మ్యాచ్‌లలో పంజాబ్‌కు మాక్సీ నుండి ఎన్నో ఆశలు ఉండబోతున్నాయి. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 20 ఓవర్లలో 219 పరుగులు చేసింది. పంజాబ్ తరపున ప్రియాంష్ ఆర్య 42 బంతుల్లో 103 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అతనితో పాటు శశాంక్ సింగ్ 36 బంతుల్లో 52 పరుగులు చేశాడు.

# స్పోర్ట్స్

## తేలిపోయిన సన్‌రైజర్స్



కిందటి ఐ పిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అ సాధారణ ఆటతో చెలరేగిపోయిన సంగతి తెలిసిం దే. బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో హైదరాబాద్ అద్భుత ప్రతిభను కనబరిచింది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ తదితరులు ఆకాశ మే హద్దుగా చెలరేగి పోయారు. 2024లో సన్‌రైజర్స్ బ్యాటింగ్‌లో ఎన్నో రికార్డులను తిరిగరాసింది. కానీ ఈ సీజన్‌లో సీన్ పూ ర్తిగా మారిపోయింది. బ్యాటింగ్‌లో సన్‌రైజర్స్ పూర్తిగా తేలిపోతోంది. రాజస్థాన్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో తప్పిస్తే హైదరాబాద్ బ్యాటర్లు ఏ మ్యాచ్‌లోనూ సత్తా చాటలేక పోయారు. తొలి మ్యాచ్‌లో సెంచరీతో అలరించిన ఇషాన్ కిషన్ ఆ తర్వాతి మ్యాచుల్లో పూర్తిగా నిరాశ పరిచాడు. వరుసగా మూడు మ్యాచుల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితయ్యాడు. అభిషేక్ శర్మ కూడా చెత్త బ్యాటింగ్‌తో సతమతమవుతున్నాడు. హెడ్ కూడా ఫామ్ కోసం తంటాలు పడుతున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ ఒక్కడే కాస్త మెరుగైన ఆటను కనబరుస్తున్నాడు. ఇక ఈ సీజన్‌లో ఇప్పటికే ఐదు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ కేవలం ఒకే ఒక మ్యాచ్‌లో విజయం సాధించింది. దీంతో సన్‌రైజర్స్ ప్లేఆఫ్ అవకాశాలు క్లిష్టంగా మారాయి. ఇకపై జరిగే మ్యాచుల్లోనైనా హైదరాబాద్ బ్యాటర్లు రాణిస్తారా లేదా వేచి చూడాల్సిందే.



## తారక్‌తో సుకుమార్ సినిమా

పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ కొట్టిన దర్శకుడు సుకుమార్ కొత్త ప్రాజెక్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 'పెద్ది' సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత రామ్‌చరణ్‌తో సినిమా చేయాల్సివుంది. దీనికోసం ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ కొనసాగిస్తున్నారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ (తారక్) 'వార్ 2'లో నటిస్తున్నారు. త్వరలో ప్రశాంత్‌నీల్ ప్రాజెక్టులో చేరుతారు. ఇలాంటి పరిస్థితుల్లో తారక్‌తో సుకుమార్ భేటీపై ఇండిస్ట్రీలో చర్చలు కొనసాగుతున్నాయి. సుకుమార్ సతీమణి తబిత ఇన్‌స్టాలో వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోను షేర్‌చేశారు. 'తారక్‌కి ప్రేమతో' అని సుకుమార్ భుజంపై తారక్ వాలి ఉన్న ఫొటోని పోస్ట్‌చేశారు. దీన్ని తారక్ రీపోస్ట్ చేయగా%ౌ% మళ్లీ దీన్ని సుకుమార్ రీ పోస్టు చేసి 'మై అభిరామ్' అని రాసుకొచ్చారు. గతంలో సుకుమార్..ఎన్టీఆర్‌తో 'నాన్నకు ప్రేమతో' సినిమా తీయగా అది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరు భేటీపై కొత్త ప్రాజెక్టుకు రంగం షురూ అంటూ ఇండిస్ట్రీలో చర్చలు కొనసాగుతున్నాయి.



## అభిమానుల ఫ్రస్ట్రేషన్ న్యాయమే కానీ

ది రాజా సాబ్ విషయంలో జరుగుతున్న ఆలస్యం, అప్డేట్స్ లేకుండా కనిపిస్తున్న నిర్లిప్తత ఫ్యాన్స్ ని ఫ్రస్ట్రేట్ చేస్తున్న మాట వాస్తవం. దర్శకుడు మారుతీ తన ఎక్స్ లో పెడుతున్న ట్వీట్స్ కు కామెంట్స్ పెట్టకుండా ఆప్షన్ ఎంచుకోవడం చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిన్న తత్వం అనే చిన్న సినిమాకు విష్ చేసిన మారుతీ దాని కింద ఎవరూ రెస్పాండ్ కాకుండా చూసుకున్నారు. ఇవాళ పుణ్యక్షేత్రాల సందర్శన సందర్భంగా పెట్టిన ఫోటోలకు ఎలాంటి రిస్ట్రిక్షన్ లేకపోవడంతో యథావిధిగా ఫ్యాన్స్ కామెంట్స్ తో దాడి చేశారు. నిజానికి ఇక్కడ మారుతీ వైపే అన్ని వేళ్ళు లేవు. రకరకాల కారణాలతో రాజా సాబ్ కు బ్రేక్ పడింది.కొంచెం టైం పట్టేలా ఉండటంతో ప్రభాస్ ఫౌజీ వైపు ఎక్కువ దృష్టి పెట్టాడు. అయితే డార్లింగ్ ఫ్యాన్స్ వెర్షన్ వేరేలా ఉంది. రాజా సాబ్ ని ఏప్రిల్ నుంచి వాయిదా వేసుకున్నాక కనీసం ఇంకో రెండు మూడు నెలల్లో రిలీజ్ చేసేలా ప్లాన్ చేసుకోవాలి కానీ ఇలా కాలం వృథా చేస్తూ పోతే ఉన్న బజ్ కూడా తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. అసలు ఈ ఏడాది వస్తుందా రాదానే అనుమానాలు వాళ్లలో బలంగా ఉన్నాయి. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ వైపు నుంచి ఫ్రెష్ గా వాయిదా గురించైనా సరే ఒక అఫీషియల్ అప్డేట్ వస్తే అభిమానుల అసంతృప్తిని కొంత తగ్గించవచ్చు. అసలే ప్రభాస్ లైనప్ చాలా పెద్దది ఉంది. రాజా సాబ్, ఫౌజీ, స్పిరిట్, సలార్ పార్ట్ 2 శౌర్యంగపర్వం, కల్కి 2 ఇలా దర్శకులందరూ క్యూ కట్టి ఉన్నారు. అన్నీ లెక్కేసుకుంటే పేపర్ మీద బడ్జెట్ రెండు వేల కోట్లు దాటిపోతుంది. టయర్ 1 స్టార్ హీరోల్లో వేగంగా ప్యాన్ ఇండియా మూవీస్ చేస్తున్న ప్రభాస్ రిలీజ్ ప్లానింగ్ పరంగా అంతే స్పీడ్ గా లేకపోవడం పట్ల ఫ్యాన్స్ ఆందోళన చెందడం న్యాయమే. ప్రాజెక్టు మొదలుపెట్టినప్పుటి ట్యూన్స్ ఇప్పుడు అవుట్ డేట్ అయ్యాయని, కొత్త పాటలు కంపోజ్ చేస్తున్నానని ఇటీవలే తమన్ చెప్పడం మరో కొసమెరుపు. చెట్టెక్కిన భేతాళుడిలా రాజా సాబ్ ఆగమనం త్వరలో అయితే జరిగేలా లేదు.



## నాగ సాధువుగా తమన్నా అద్భుతమైన నటన

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ ఇది. సంపత్ నంది కథ, స్క్రీన్‌ప్లే, డైలా గ్ రైటర్ గా మల్టిపుల్ రోల్స్‌లో వర్క్ చేశారు. అలాగే డైరెక్షన్ సూపర్ విజన్‌ని అందిస్తున్నారు. అశోక్ తేజ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్ బ్యానర్స్ పై డి.మధు నిర్మిస్తున్నారు. ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. నాగ సా ధువుగా తమన్నా భాటియా అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరోయి న్ తమన్నా మాట్లాడుతూ " సంపత్ నంది ఈ సినిమాలో నా పాత్రని రాసిన విధానం చాలా అద్భుతం గా ఉంటుంది. వశిష్ట సింహ తన అద్భుతమైన నటనతో సినిమాను మరో స్థాయికి తీసుకువెళ్లాడు.

## అదరగొట్టిన 'లెనిన్' గ్లింప్స్...

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెం ట్స్ యంగ్ అండ్ డైనమిక్ హీరో అఖిల్ అక్కినేనితో భారీ సినిమాను నిర్మిస్తున్నాయి. 'అఖిల్ 6'ని అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్కినేని అఖిల్ పుట్టినరోజును పురస్కరించుకుని అఖిల్ 6వ చిత్రానికి లెనిన్ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటించారు. మురళీ కిశోర్ అబ్బూరు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వినరో భాగ్యము విష్ణు కథ చిత్రంతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు మురళీకిశోర్ అబ్బూరు. ఇంటెన్స్, యాక్షన్ ప్యాక్డ్ ఎక్స్‌పీరియన్స్ తో రాయలసీమ నేపథ్యంలో రోమాలు నిక్కబొడుచుకునేలా సాగింది లెనిన్ గ్లింప్స్. టైటిల్ గ్లింప్స్ పవర్‌ఫుల్ విజువల్స్‌తో ప్రారంభమైంది. ఆధ్యాత్మిక అంశాలను చొప్పిస్తూ ఆద్యంతం ఆకట్టుకునే ప్రయత్నం చేశారు మేకర్స్. అఖిల్ అక్కినేని%ౌ% స్టన్నింగ్ లెనిన్ పాత్రకు అద్భుతంగా సరిపోయారు. ఆయన దట్టమైన మీసం, పొడవాటి జుట్టు మ్యాచో అవతార్‌కు పక్కాగా సూట్ అయ్యాయి. అఖిల్ సరసన శ్రీలీల నటిస్తున్న విషయం గ్లింప్స్‌లో తెలియజేశారు. టైటిల్ గ్లింప్స్‌లో మాసివ్ యాక్షన్ మొమెంట్స్, పంచ్ మాత్రమే కాదు పవర్‌ఫుల్ డైలాగ్ కూడా ఆడియన్స్‌ని కట్టిపడేసింది. 'పుట్టేటప్పుడు ఊపిరి ఉంటుంది రా, పేరు ఉండదు. పోయేటప్పుడు ఊపిరి ఉండదు, పేరు మాత్రమే ఉంటుంది' అని రాయలసీమ యాసలో అఖిల్ చెప్పిన డైలాగ్ సింపుల్‌గా అదుర్స్ అంతే. ఒళ్లు గగుర్పొడిచేలా సాగింది లెనిన్ టైటిల్ గ్లింప్స్.





## ఊర్వశి రౌతేలా క్రేజ్.. డాకు మహారాజ్ చిత్రానికి అవార్డ్!

బాలీవుడ్ భామ ఊర్వశి రౌతేలా ఈ ఏడాది డాకు మహారాజ్‌తో టాలీవుడ్ ప్రియులను ?అలరించింది. బాలకృష్ణ హీరోగా నటించిన ఈ సినిమాలో కీలక పాత్ర పోషించింది. అంతేకాకుండా ఈ సినిమాలో దబిడి దిబిడి సాంగ్‌తో ఫ్యాన్స్‌ను మెప్పించింది. అయితే ఈ పాటపై పెద్దఎత్తున వివాదానికి దారితీసింది. ఈ సాంగ్ కొరియోగ్రఫీపై పలువురు విమర్శలు చేశారు. ఇవన్నీ పక్కన పెడితే తాజాగా బాలీవుడ్ భామను ఓ అవార్డ్ వరించింది. ఫ్యాన్స్ ఫేవరేట్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్-2025కు ఎంపికైంది ముద్దుగుమ్మ. డాకు మహారాజ్ చిత్రంలో ప్రదర్శనకు గానూ గోల్డెన్ క్వీన్ అవార్డ్‌ను దక్కించుకుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. అవార్డ్ చేతిలో పట్టుకుని ఉన్న ఫోటోలను షేర్ చేసింది. అంతే కాకుండా తనకు సపోర్ట్ చేస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపింది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com